CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 50 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట సోమవారం 27 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 50 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA MON 27 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ‘బ్లూ బ్యాచ్’ సమాజానికి ప్రమాదకరంగా మారిందనడంలో సందేహం లేదు

- వైసీపీ అనుబంధ సోషల్ మీడియాపై మంత్రి లోకేశ్ తీవ్ర విమర్శలు
- పక్క రాష్ట్రం వీడియోను అరకులో జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- గతంలోనే ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిజాలు వెల్లడించామన్న మంత్రి
- అది రాజకీయ పార్టీనా లేక నేరగాళ్ల ముఠానా అని ఘాటు వ్యాఖ్య
- ఫేక్ ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం
- ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని నారా లోకేశ్ సూచన



పెన్ పవర్ డెస్క్:ఓ అంశంలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండపడ్డారు. పొరుగు రాష్ట్రంలోని ఒక గురుకుల పాఠశాలలో 2023లో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోను, తాజాగా అరకులో జరిగినట్లు చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి ఫేక్ ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలనుకునే శక్తులు సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆయన ‘ఎక్స్’ ద్వారా హెచ్చరించారు. “తప్పుడు ప్రచారం ఆధారంగా రాజకీయం చేద్దామనుకుంటున్న ‘బ్లూ బ్యాచ్’ సమాజానికి ప్రమాదకరంగా మారిందనడంలో సందేహం లేదు. పక్క రాష్ట్రంలో ఒక గురుకుల పాఠశాలలో 2023 నాటి పరిస్థితికి సంబంధించిన ఒక వీడియోను తాజాగా అరకు లో జరిగినట్లు ఒక కథనం రాసి వైసీపీ అనుబంధ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే వార్తపై, ఇదే వీడియో పై రాష్ట్ర ప్రభుత్వం తరపున ‘ఫ్యాక్ట్ చెక్’ లో సంపూర్ణ వివరాలతో సమాచారం అందించినా కూడా కొద్ది రోజులు ఊరుకుని మళ్లీ అదే వీడియోతో తాజాగా తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ఇలా తరచూ నేరాలకు పాల్పడేవారిని ‘హ్యాబిచ్యువల్ అఫెండర్స్’ (నేరాలు చేయడానికి అలవాటు పడ్డవారు) అంటారు. అందుకే అది ఒక రాజకీయ పార్టీనా, లేక హ్యాబిచ్యువల్ అఫెండర్స్ ముఠానా అనే అనుమానం వస్తున్నది. ఈ ఫేక్ ప్రచారాన్ని ప్రజలు ఎవరూ కూడా నమ్మవద్దు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవలసిందిగా పోలీసులను వారిని కోరుతున్నాను” అని లోకేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.




## మొంథా తుపాను ఎఫెక్ట్ నిర్మలా సీతారామన్ ఏపీ పర్యటన వాయిదా

- ఈ నెల 28న అమరావతిలో పర్యటించాల్సి ఉన్న కేంద్ర మంత్రి
- ఒకేసారి 12 బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాలకు శంకుస్థాపన
- అదే రోజు ఉత్తర కోస్తాలో తీరం దాటనున్న మొంథా తుపాను
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు అధికార యంత్రాంగం హెచ్చరికలు
- త్వరలో నిర్మల పర్యటనకు కొత్త తేదీ ఖరారు చేసే అవకాశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌పై ‘మొంథా’ తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర పర్యటన వాయిదా పడింది.

వివరాలు 2లో..



## మొంథా తుపాన్.. అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం

- అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం
- విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రానివ్వొద్దని సూచన
- రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆర్డర్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పై మొంథా తుపాన్ పెను ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగంతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 28వ తేదీ ఉదయానికి వాయుగుండం

వివరాలు 2లో..

## కొమురం భీమ్ చరిత్ర తెలుసుకోండి.. మన్ కీ బాత్ లో యువతకు ప్రధాని మోదీ పిలుపు



పెన్ పవర్ డెస్క్: ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్ పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ‘బ్రిటిషర్ల దోపిడీ, నిజాం దురాగతాలు పెరిగిపోయిన సమయంలో 20 ఏండ్ల యువకుడుఎదురు నిలబడ్డాడు. తన పోరాటంలో

వివరాలు 2లో..

## 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపేశా.. త్వరలో పాక్-ఆఫ్ఘాన్ వివాదం ముగిస్తా



పెన్ పవర్ డెస్క్: అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ మరో సారి సెల్ఫ్ డబ్బా కొట్టుకు న్నారు. తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక 8 నెలల్లో 8 యు ద్ధాలు ఆపానని ప్రగల్భాలు పలికారు. త్వరలోనే పాక్-ఆఫ్ఘాన్ వివాదాన్ని

వివరాలు 2లో..

## మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్.. 71 మంది నక్సలైట్లు సరెండర్



పెన్ పవర్ డెస్క్: ఆపరేషన్ కగార్, అగ్రనేతల వరుస లొంగుబాట్లతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. మావోయిస్ట్ పార్టీకి చెందిన మరో 71 మంది నక్సలైట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట సరెండర్

వివరాలు 2లో..

## ఇంకెవరి దగ్గర ఈ క్షిపణి లేదు... విజయవంతంగా పరీక్షించాం పుతిన్ సంచలన ప్రకటన



- రష్యా ‘బురవెస్ట్నిక్’ అణుశక్తి క్షిపణి పరీక్ష విజయవంతం
- ఎలాంటి రక్షణ కవచాన్నైనా ఛేదించగలదని పుతిన్ ప్రకటన
- ఈ క్షిపణిని త్వరలో మోహరిస్తామని వెల్లడి
- పరీక్షలో 14,000 కిలోమీటర్లు ప్రయాణించిన క్షిపణి
- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలకు బలమైన సంకేతం
- ఇది ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేక ఆయుధమన్న పుతిన్

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్ యుద్ధం విషయంలో పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన ప్రకటన చేశారు. అణుశక్తితో పనిచేసే ‘బురవెస్ట్నిక్’ క్రూయిజ్ క్షిపణిని రష్యా విజయవంతంగా పరీక్షించినట్లు ఆదివారం వెల్లడించారు. ప్రపంచంలోని ఏ రక్షణ వ్యవస్థనైనా ఛేదించగల ఈ అస్త్రం త్వరలో సైనిక మోహరింపునకు సిద్ధమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్షిపణి పరీక్ష, గత వారం నిర్వహించిన అణు విన్యాసాలు.. అమెరికా సహా పాశ్చాత్య దేశాలకు రష్యా పంపుతున్న బలమైన సంకేతంగా అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.రాయిటర్స్ కథనం ప్రకారం, అక్టోబర్ 21న ఈ క్షిపణిని పరీక్షించారు. సైనిక దుస్తుల్లో ఉన్న పుతిన్.. ఉక్రెయిన్

వివరాలు 2లో..

## ఒకప్పుడు బాలకృష్ణ అభిమానిగా బ్యానర్లు మోసినోడు ఇప్పుడు చిత్రంగా ప్రవర్తిస్తున్నాడు: జగన్ పై సోమిరెడ్డి ఫైర్

- జగన్ రెడ్డి ప్రవర్తనలో స్పష్టమైన తేడా కనిపిస్తోందన్న సోమిరెడ్డి
- అసెంబ్లీకి రాని వ్యక్తి రెండున్నర గంటలు ప్రెస్ మీట్ పెట్టాడని వ్యాఖ్యలు
- అన్నీ పచ్చి అబద్ధాలు చెప్పి రికార్డు సృష్టించాడని వ్యంగ్యం
- జగన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పించాలని సలహా



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ ప్రవర్తనలో స్పష్టమైన తేడా కనిపిస్తోందని, ఆయనకు వెంటనే వైద్యం చేయించాలని సలహా ఇచ్చారు. “జగన్ లో ఏదో తేడా కనిపిస్తోంది. భారతమ్మా.. వెంటనే ట్రీట్మెంట్ చేయించండి. జగన్ రెడ్డిలో నాకు ఏదో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఒకప్పుడు నందమూరి బాలకృష్ణ అభిమానిగా ఆయన బ్యానర్లు, ఫ్లెక్సీలు మోసినోడు... ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చుని విచిత్రంగా వ్యవహరిస్తున్నాడు.

వివరాలు 2లో..

## నీటి అడుగున నిఘా కోసం దెయ్యం రోబో.. చైనా శాస్త్రవేత్తల అద్భుతం!

- సముద్ర గర్భంలో రహస్య మిషన్ల కోసం జెల్లీఫిష్ రోబో
- చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ‘అండర్‌వాటర్ ఫాంటమ్’
- నిజమైన జెల్లీఫిష్‌ను పూర్తిగా పోలిన పారదర్శక నిర్మాణం
- కెమెరా, ఏఐ చిప్‌తో లక్ష్యాలను గుర్తించగల సామర్థ్యం
- సముద్ర జీవులకు ఎలాంటి హాని లేకుండా పర్యవేక్షణ
- నార్త్‌వెస్టర్న్ పాలిటెక్నికల్ యూనివర్సిటీ పరిశోధకుల ఆవిష్కరణ




పెన్ పవర్ డెస్క్:సముద్ర గర్భంలో రహస్య ఆపరేషన్లు, నిఘా కార్యకలాపాల కోసం చైనా శాస్త్రవేత్తలు ఒక ప్రత్యేకమైన రోబోను అభివృద్ధి చేశారు. చూడటానికి అచ్చం నిజమైన జెల్లీఫిష్‌లా కనిపించే ఈ రోబోను “అండర్‌వాటర్ ఫాంటమ్” (కనిపించని దెయ్యం) అని పిలుస్తున్నారు. సముద్ర పర్యావరణానికి, జీవులకు ఎలాంటి

వివరాలు 2లో..

## బీహార్ ప్రచారానికి కాంగ్రెస్ సిద్ధం...

### సోనియా, రాహుల్‌తో స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల



- బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల
- తొలి దశ ప్రచారం కోసం 40 మంది అగ్రనేతలను ప్రకటించిన పార్టీ
- జాబితాలో ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ పేర్లు
- స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్, కన్హయ్య కుమార్‌కు కూడా చోటు
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో బీహార్ ఎన్నికల పోలింగ్
- ‘ఇండియా’ కూటమి సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించిన విపక్షాలు

వివరాలు 2లో..

## ఆ మూడు రోజులు తీవ్ర గాలులు, అత్యంత భారీ వర్షాలు ఉంటాయి



- రాష్ట్రానికి పొంచి ఉన్న ‘మొంథా’ తుపాను ప్రమాదం
- విపత్తుల నివారణపై మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష
- ఈ నెల 27, 28, 29 తేదీల్లో అత్యంత భారీ వర్షాల సూచన
- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచన
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరిక జారీ

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## జగన్ అరెస్ట్ బీజేపీ లక్ష్యం...ఇదే ఖాయం !

ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత వైఎస్ జగన్ ని అరెస్ట్ చేయాలని ఎవరికి ఉంటుంది అంటే ఎక్కువ మంది చెప్పే మాట టీడీపీకే అని. ఎందుకంటే తెలుగుదేశం పార్టీకి వైసీపీకి మధ్య హోరా హోరీ పోరు ఉంటుంది. అధికార మార్పిడి ఈ రెండు పార్టీల మధ్యనే జరుగుతుంది. బీజేపీకి ఏపీలో పెద్దగా బలం అయితే లేదు. ఇక కూటమి కట్టి కొన్ని సీట్లు ఏపీలో గెలుచుకుంది జాతీయ స్థాయిలో అయితే దీర్ఘకాలం బీజేపీ పాలించాలని చూస్తోంది. దానికోసం అన్ని పార్టీలతోనూ సఖ్యతను నెరుపుతోంది. ఏపీ విషయానికి వస్తే అన్నీ పార్టీలు ఎన్డీయే పార్టనర్స్ అనే బీజేపీ ప్రత్యర్ధులు అంటారు. వారు అనడమే కాదు, ఏపీలో కనిపిస్తున్న రాజకీయ దృశ్యం అలాగే ఉంది కూడా. ఆ మధ్యన జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏపీలో టీడీపీ జనసేనతో పాటు వైసీపీ ఎంపీలు కూడా ఎన్డీయే అభ్యర్ధికే ఓటేశాయి.

**కచ్చితంగా అరెస్ట్ :**

ఇదిలా ఉంటే ఏపీ కూటమిలో బీజేపీ తరఫున మంత్రిగా వ్యవహరిస్తున్న సత్య కుమార్ యాదవ్ తాజాగా ఒక ప్రముఖ టీవీ చానల్ తో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జగన్ అరెస్ట్ మీద సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ ని ఎపుడు అరెస్ట్ చేస్తారు అంటే తొందరలోనే ఏ మాత్రం తడుముకోకుండా సత్య కుమార్ యాదవ్ జవాబు ఇవ్వడం విశేషం. లిక్కర్ స్కాం సహా అనేక విషయాలలో గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు అన్ని విధాలుగా దోచేసి సొంత ఖజానా నింపుకున్నారని ఆయన ఆరోపించారు. అందుకే దీని మీద కూటమి ప్రభుత్వం విచారణ చేయిస్తోంది అని ఆయన అన్నారు.

**సూత్రధారి కూడా :**

లిక్కర్ స్కాం లో ఇప్పటిదాకా పాత్రధారులే అరెస్ట్ అయ్యారని సత్య కుమార్ యాదవ్ చెప్పారు. అయితే ఈ కేసుని మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. అది పూర్తి అయినపుడు అన్ని ఆధారాలు లభ్యం అయినపుడు సూత్రధారిని కూడా అరెస్ట్ చేస్తామని ఆయన జగన్ అరెస్టు గురించి హింట్ ఇచ్చారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని కూడా స్పష్టం చేశారు. బీజేపీ ఏ రకమైన అవినీతిని సహించే ప్రసక్తి లేదని సత్య కుమార్ యాదవ్ గట్టిగా చెప్పారు.

**మద్దతు అన్నది మర్యాదకే :**

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ నుంచి మద్దతు తీసుకోవడం అన్నది కేవలం మర్యాద కోసమే అని అన్నారు. అది రాజ్యాంగబద్ధమైన పదవి అన్నది అంతా గుర్తు ఉంచుకోవాలని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేని పదవి కోసం ఏకాభిప్రాయం కోసం బీజేపీ తన వంతుగా ప్రయత్నం చేసింది అన్నారు. ఈ విషయంలో కేవలం వైసీపీని మాత్రమే మద్దతు కోరలేదని మమతా బెనర్జీ వామపక్షాలు మజ్లిస్ పార్టీ ఇలా అందరికీ అడిగామని అన్నారు. రాజ్యాంగ పదవి విషయంలో పోటీ ఉండకూడదు అన్నది బీజేపీ విధానం అని ఆయన చెప్పారు. అంతమాత్రం చేత వైసీపీతో ఏదో తెర వెనక బంధం ఉందని ఎవరూ అనుకోవాల్సిన అవసరం అయితే లేదని ఆయన స్పష్టం చేశారు.

**తీవ్ర వ్యాఖ్యలు :**

వైసీపీ మీద సత్య కుమార్ యాదవ్ టీడీపీ తరహాలోనే తీవ్ర వ్యాఖ్యమే చేశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నష్టపరచారని అయిదేళ్ళ పాలనలో అన్యాయం జరిగిందని అన్నారు. అందుకే వైసీపీ విషయంలో బీజేపీ కూడా ఏ విధమైన సాఫ్ట్ కార్నర్ చూపించేది ఉండదని అన్నారు. కూటమిలోని టీడీపీ సహా ఇతర మిత్రులతో పాటు బీజేపీ కూడా జగన్ అరెస్టుని నూరు శాతం కోరుకుంటోందని అయితే అన్ని ఆధారాలు లభించిన తరువాతనే ఏదైనా జరుగుతుందని ఆయన చెప్పడం విశేషం. ఒక విధంగా ఒక బీజేపీ కీలక నేత జగన్ కి ఫుల్ యాంటీగా ఆయన అరెస్టుని కోరుకుంటూ స్టేట్మెంట్ ఇవ్వడం అంటే ఒక సంచలనంగానే చెప్పాల్సి ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## నీటి అడుగున నిఘా కోసం దెయ్యం రోబో.. చైనా శాస్త్రవేత్తల అద్భుతం!

- మొదటి పేజి తరువాయి

హాని కలగకుండా ఇది తన పని తాను చేసుకుపోవడం దీని ప్రత్యేకత. చైనాలోని నార్త్‌వెస్టర్న్ పాలిటెక్నికల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడు టావో కాయ్ నేతృత్వంలోని బృందం ఈ బయోనిక్ జెల్లీఫిష్‌ను రూపొందించింది. హైడ్రోజెల్ ఎలక్ట్రోడ్ అనే ప్రత్యేక పదార్థంతో దీని పారదర్శక శరీరాన్ని, టెంటకిల్స్‌ను తయారు చేశారు. ఇది నీటిలో కదులుతున్నప్పుడు నిజమైన జెల్లీఫిష్‌కు, దీనికి తేడాను గుర్తించడం చాలా కష్టం. 120 మిల్లీమీటర్ల వ్యాసం, కేవలం 56 గ్రాముల బరువుతో ఇది చాలా కాంపాక్ట్‌గా ఉంటుంది. ఈ రోబో పనితీరు గురించి టావో కాయ్ వివరిస్తూ, "ఇది చాలా తక్కువ విద్యుత్‌ను వినియోగించుకుంటుంది. దాదాపు శబ్దం చేయకుండా పనిచేస్తుంది. దీని స్వరూపం నిజమైన జీవిలాగే ఉండటం వల్ల సముద్ర గర్భంలో రహస్య నిఘాకు, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలను పరిశీలించడానికి, నీటి అడుగున ఉన్న నిర్మాణాలను కచ్చితత్వంతో తనిఖీ చేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది" అని సైన్స్ అండ్ టెక్నాలజీ డైలీకి తెలిపారు. ఈ రోబోలో ఒక కెమెరా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చిప్‌ను అమర్చారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా ఇది నీటి అడుగున ఉన్న లక్ష్యాలను స్వయంగా గుర్తించగలదు. జెల్లీఫిష్ నాడీ సంకేతాలను అనుకరించే ఎలక్ట్రోస్టాటిక్ హైడ్రాలిక్ యాక్యుయేటర్ సాయంతో ఇది కదులుతుంది. ఇటీవలే చైనా ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ సీసీటీవీలో ప్రసారమైన ఒక సైన్స్ కార్యక్రమంలో ఈ రోబో సామర్థ్యాలను ప్రదర్శించారు. నీటి ప్రవాహంలో మార్పులు వచ్చినా స్థిరంగా ఉండటం, క్లౌన్‌ఫిష్ వంటి నిర్దిష్ట జీవులను కచ్చితత్వంతో గుర్తించడం వంటివి చేసి చూపించారు. నార్త్‌వెస్టర్న్ పాలిటెక్నికల్ యూనివర్సిటీ రోబోటిక్స్, ఏరోస్పేస్ రంగంలో అత్యాధునిక పరిశోధనలకు ప్రసిద్ధి చెందింది. పక్షులు, కీటకాలను పోలిన రోబోలను తయారు చేయడంలో ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సముద్ర గర్భంలో అన్వేషణకు సంబంధించిన ఇంధన సామర్థ్యం, నిశ్శబ్ద పనితీరు వంటి సవాళ్లను అధిగమించడంలో ఈ జెల్లీఫిష్ రోబో ఒక కీలక ముందడుగు అని నిపుణులు భావిస్తున్నారు.

తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ ప్రవర్తనలో స్పష్టమైన తేడా కనిపిస్తోందని, ఆయనకు వెంటనే వైద్యం చేయించాలని సలహా ఇచ్చారు. "జగన్ లో ఏదో తేడా కనిపిస్తోంది. భారతమ్మా.. వెంటనే ట్రీట్మెంట్ చేయించండి. జగన్ రెడ్డిలో నాకు ఏదో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఒకప్పుడు నందమూరి బాలకృష్ణ అభిమానిగా ఆయన బ్యానర్లు, ఫ్లెక్సీలు మోసినోడు... ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చుని విచిత్రంగా వ్యవహరిస్తున్నాడు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలి... కానీ ఆ దమ్ము లేదు. తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చుని నోటికొచ్చినట్టు మాట్లాడుతాడు. రెండున్నర గంటలు ఆపకుండా అబద్ధాలతో ప్రెస్ మీట్ నిర్వహించే రాజకీయ నాయకుడు దేశంలోనే కాదు... ప్రపంచంలోనే ఉండరేమో! పబ్లిక్ మీటింగుల్లో ఒక గంట స్పీచ్ ఇచ్చే వారిని చూశాం కానీ... ఇలా ప్రెస్ పెట్టే వారిని ఎప్పుడూ చూడలేదు. అరగంట అసెంబ్లీలో కూర్చోలేని పెద్దమనిషి ప్రెస్ మీట్లో రెండున్నర గంటలు కూర్చుంటాడు. జగన్ రెడ్డిలో చాదస్తం పెరగడం కాదు... కచ్చితంగా ఏదో తేడా ఉంది. ఆపకుండా రెండున్నర గంటలు ఒక్క నిజం లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడి రికార్డు సృష్టించాడు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఏదైనా సాధిస్తే తన బ్లూ మీడియాలో వ్యతిరేకిస్తాడు... ఆ మరుసటి రోజు అది తెచ్చింది తానే అంటాడు. ఇలాంటి రాజకీయ నాయకుడిని గత 50 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. జగన్ రెడ్డి ఒక ప్రత్యేకమైన క్యారెక్టర్... తల్లి, చెల్లి ఆయనకు దూరంగా ఉన్నారు. కనీసం భారతమ్మ అయినా ఆసుపత్రికి తీసుకెళ్లి బ్రెయిన్ టెస్ట్ చేయించాలి. నాకైతే మాత్రం ఆయనలో ఏదో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే మంచి ట్రీట్మెంట్ చేయించాలని నా సలహా" అంటూ సోమిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ఆ మూడు రోజులు తీవ్ర గాలులు, అత్యంత భారీ వర్షాలు ఉంటాయి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'మొంథా' తుపాను ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను సన్నద్ధతపై రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ సాయి ప్రసాద్, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్, రాబోయే 'మొంథా' తుపాను గమనం, తీవ్రత, దానివల్ల ప్రభావితమయ్యే జిల్లాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంసిద్ధంగా ఉండాలని మంత్రి అనిత ఆదేశించారు. ముఖ్యంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో రాష్ట్రంలో తీవ్రమైన గాలులతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. తీర ప్రాంత ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలి. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి" అని మంత్రి అనిత స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించి, సురక్షితంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## బీహార్ ప్రచారానికి కాంగ్రెస్ సిద్ధం...

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. తొలి దశ ఎన్నికల కోసం 40 మంది స్టార్ క్యాంపెయినర్లతో కూడిన జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలకు చోటు కల్పించింది. పార్టీ తరఫున ప్రచారం చేయనున్న ప్రముఖులలో కన్హయ్య కుమార్, స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ (రాజేష్ రంజన్) కూడా ఉన్నారు. వీరితో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, భూపేష్ బఘేల్, సచిన్ పైలట్, రణ్‌దీప్ సుర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్ వంటి కీలక నేతలు బిహార్‌లో ప్రచారం నిర్వహించనున్నారు. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, దిగ్విజయ్ సింగ్, అధిర్ రంజన్ చౌదరి, మీరా కుమార్, తారిఖ్ అన్వర్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. బీహార్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కృష్ణ అల్లవారపు, పీసీసీ అధ్యక్షుడు రాజేష్ రామ్, సీనియర్ నేతలు గౌరవ్ గొగోయ్, మహమ్మద్ జావేద్, అఖిలేశ్ ప్రసాద్ సింగ్ వంటి స్థానిక నేతలకు కూడా ప్రచార బాధ్యతలు అప్పగించారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు

నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు భాగస్వాములుగా ఉన్న 'ఇండియా' కూటమి, తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌ను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

## కొమురం భీమ్ చరిత్ర తెలుసుకోండి.. మన్ కీ బాత్ లో యువతకు ప్రధాని మోదీ పిలుపు

- మొదటి పేజి తరువాయి

నిజాం అధికారిని చంపి, అరెస్టు నుంచి తప్పించు కున్నాడు. నేను మాట్లాడేది కొమురం భీమ్ గురించే. ఈ నెల 22న ఆయన జయంతి జరిగింది. ఎంతో మంది హృదయాల్లో చెరగని ముద్ర వేసిన భీమ్ గురించి యువత తెలుసు కోవాలి' అని మన్ కీ బాత్ బాత్ లో పిలుపునిచ్చారు. పండుగల సమయంలో దేశ ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. మన పండుగలు సామాజిక ఐక్యతకు ఉదాహరణ అని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రభు త్వం సాధించిన విజయాన్ని ప్రశంసించారు. మానవ శ్రేయస్సుకు

ఉపయోగపడే విధంగా దేశ ప్రజలంతా మొక్కలు నాటాలని, మన గ్రంథాలలో ఇదే విషయాన్ని వివరించారని గుర్తు చేశారు. ఈ నెల 31న జరగనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని గుర్తు చేసుకున్న పీఎం.. ఆ రోజున దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఐక్యతా పరుగు కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

## 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపేశా.. త్వరలో పాక్-ఆఫ్ఘాన్ వివాదం ముగిస్తా

- మొదటి పేజి తరువాయి

కూడా పరిష్కరిస్తానని అతి విశ్వాసం ప్రదర్శించారు. ఆదివారం (అక్టోబర్ 27) మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన ASEAN శిఖరాగ్ర సమావేశం సందర్భంగా థాయిలాండ్–కంబోడియా దేశాలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. తన నాయకత్వంలో ఇప్పటికే ఎనిమిది యుద్ధాలు ముగించానని చెప్పారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య కూడా త్వరగా శాంతిని తీసుకువస్తానని.. ఆ రెండు దేశాల అధినేతలు తనకు చాలా బాగా తెలుసని పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లో 8 యుద్ధాలు ముగించడం అనేది గతంలో ఎప్పుడూ జరగలేదని.. ఇకమీదట కూడా ఇది సాధ్యం కాదని పగల్భాలు పలికారు. యుద్ధాలను ముగించడం అనేది ఒక గొప్ప పనిగా తాను భావిస్తున్నానని.. లక్షలాది మంది ప్రాణాలను కాపాడగలిగితే అది గొప్ప కృషి అవుతుందన్నారు. ఒక యుద్ధాన్ని పరిష్కరించిన ఏ అధ్యక్షుడి గురించి తాను ఆలోచించలేనని.. వాళ్లు కేవలం యుద్ధాలను ప్రారంభిస్తారని.. వాటిని పరిష్కరించరన్నారు. కాగా, ట్రంప్ తాను ఆపానని చెప్పుకుంటున్న 8 యుద్ధాల్లో ఇండియా, పాక్ వివాదం కూడా ఒకటి. కానీ ట్రంప్ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడూ తిప్పికొట్టింది. ఇండియా, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో వ్యక్తి లేదా దేశ ప్రమేయం లేదని ట్రంప్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చింది. ఇండియా ఎన్నోసార్లు ఖండించినప్పటికీ.. ఇండియా, పాక్ వార్ తానే ఆపానని డప్పు కొట్టుకుంటున్నారు.

## ఇంకెవరి దగ్గర ఈ క్షిపణి లేదు... విజయవంతంగా పరీక్షించాం

- మొదటి పేజి తరువాయి

యుద్ధాన్ని పర్యవేక్షిస్తున్న జనరల్స్‌తో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా రష్యా సైనిక దళాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ వాలెరీ గెరాసిమోవ్ మాట్లాడుతూ.. ఈ క్షిపణి పరీక్ష సమయంలో అణుశక్తితో ఏకధాటిగా 15 గంటల పాటు గాల్లో ప్రయాణించిందని, మొత్తం 14,000 కిలోమీటర్ల దూరాన్ని చేరుకుందని పుతిన్‌కు వివరించారు. ఈ క్షిపణికి దాదాపు అపరిమితమైన పరిధి ఉందని, దాని ప్రయాణ మార్గాన్ని అంచనా వేయడం అసాధ్యమని ఆయన తెలిపారు.

నాటో దేశాలు '%ూాజ-శ%-9 స్కైఫాల్' అని పిలుస్తున్న ఈ బురవెస్ట్నిక్ క్షిపణి గురించి పుతిన్ మాట్లాడుతూ, "ఇది ప్రపంచంలో మరెవరి దగ్గరా లేని ఒక ప్రత్యేకమైన ఆయుధం. ఒకప్పుడు ఇలాంటి క్షిపణి తయారీ అసాధ్యమని మా నిపుణులే చెప్పారు. కానీ ఇప్పుడు కీలకమైన పరీక్షలు పూర్తయ్యాయి" అని అన్నారు. ఈ ఆయుధాన్ని మోహరించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆయన జనరల్ గెరాసిమోవ్‌ను ఆదేశించారు. 2001లో యాంటీ–బాలిస్టిక్ మిస్సైల్ ఒప్పందం నుంచి అమెరికా ఏకపక్షంగా వైదొలగడం, నాటో కూటమిని విస్తరించడం వంటి చర్యలకు ప్రతిస్పందనగా 2018లోనే పుతిన్ ఈ క్షిపణి గురించి తొలిసారి ప్రకటించారు. ఉక్రెయిన్‌కు అమెరికా అత్యాధునిక ఆయుధాలు, నిఘా సమాచారం అందిస్తున్న నేపథ్యంలో, రష్యాపై దాడి చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించేందుకే ఈ పరీక్షను సరైన సమయంలో నిర్వహించినట్లు స్పష్టమవుతోంది.

## ఒకప్పుడు బాలకృష్ణ అభిమానిగా బ్యానర్లు మోసినోడు ఇప్పుడు చిత్రంగా ప్రవర్తిస్తున్నాడు: జగన్ పై సోమిరెడ్డి ఫైర్

- మొదటి పేజి తరువాయి

దమ్ముంటే అసెంబ్లీకి రావాలి... కానీ ఆ దమ్ము లేదు. తాడేపల్లి ప్యాలెస్ లో కూర్చుని నోటికొచ్చినట్టు మాట్లాడుతాడు. రెండున్నర గంటలు ఆపకుండా అబద్ధాలతో ప్రెస్ మీట్ నిర్వహించే రాజకీయ నాయకుడు దేశంలోనే కాదు... ప్రపంచంలోనే ఉండరేమో! పబ్లిక్ మీటింగుల్లో ఒక గంట స్పీచ్ ఇచ్చే వారిని చూశాం కానీ... ఇలా ప్రెస్ పెట్టే వారిని ఎప్పుడూ చూడలేదు. అరగంట అసెంబ్లీలో కూర్చోలేని పెద్దమనిషి ప్రెస్ మీట్లో రెండున్నర గంటలు కూర్చుంటాడు. జగన్ రెడ్డిలో చాదస్తం పెరగడం కాదు... కచ్చితంగా ఏదో తేడా ఉంది. ఆపకుండా రెండున్నర గంటలు ఒక్క నిజం లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడి రికార్డు సృష్టించాడు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఏదైనా సాధిస్తే తన బ్లూ మీడియాలో వ్యతిరేకిస్తాడు... ఆ మరుసటి రోజు అది తెచ్చింది తానే అంటాడు. ఇలాంటి రాజకీయ నాయకుడిని గత 50 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ చూడలేదు.

జగన్ రెడ్డి ఒక ప్రత్యేకమైన క్యారెక్టర్... తల్లి, చెల్లి ఆయనకు దూరంగా ఉన్నారు. కనీసం భారతమ్మ అయినా ఆసుపత్రికి తీసుకెళ్లి బ్రెయిన్ టెస్ట్ చేయించాలి. నాకైతే మాత్రం ఆయనలో ఏదో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే మంచి ట్రీట్మెంట్ చేయించాలని నా సలహా" అంటూ సోమిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## నిర్మలా సీతారామన్ ఏపీ పర్యటన వాయిదా

- మొదటి పేజి తరువాయి

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం, ఆమె ఈ నెల 28న రాజధాని అమరావతిలో పర్యటించాల్సి ఉంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడి, ఈ నెల 28వ తేదీన ఉత్తర కోస్తాంధ్రలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి పర్యటన వాయిదా వేశారు. నిర్మలా సీతారామన్ అమరావతిలో ఒకే రోజున 12 జాతీయ బ్యాంకుల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. అయితే, తాజా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయడమే సరైనదని భావించారు. త్వరలోనే పర్యటనకు సంబంధించిన కొత్త తేదీని ఖరారు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్.. 71 మంది నక్సలైట్లు సరెండర్

- మొదటి పేజి తరువాయి

అయ్యారు. లొంగిపోయిన వారు కాంకేర్, నారాయణ్ పూర్ జిల్లాలకు చెందిన మావోయిస్టులుగా తెలుస్తోంది. ఇందులో డివిజన్ కమిటీ నాయకులు, పలువురు ముఖ్య నేతలు ఉన్నట్లు సమాచారం. కాంకేర్ ప్రాంతం నుంచి 50 మంది, నారాయణ్ పూర్ జిల్లాలో 21 మంది.. మొత్తం 71 మంది జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. సరెండర్ అయినవారిలో13 మంది మహిళా నక్సల్స్ కూడా ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన నక్సలైట్లు 18 ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా, ఆపరేషన్ కగార్, పార్టీ సుప్రీం కమాండర్ నంబాల మరణం తర్వాత మావోయిస్టు పార్టీ రెండు వర్గాలు చీలిపోయింది. మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ, పొలిటిబ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్, సెంట్రల్ కమిటీ మెంబర్ ఆశన్న అలియాస్ సతీష్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయం తీసుకోగా.. మరో వర్గం మాత్రం ఆయుధాలు వీడే ప్రసక్తే లేదని ప్రకటించాయి. ఈ క్రమంలో మల్లోజుల, ఆశన్న గన్ డౌన్ చేసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ దెబ్బ నుంచి పూర్తిగా తేరుకోకముందే మరో 71 మంది మల్లోజుల, ఆశన్న బాటలోనే నడవడంతో మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలినట్లైంది.

## మొంథా తుపాన్.. అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

తీవ్రమైన తుపానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సోషల్ మీడియాను వాడుకోవాలి..**

మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు తుపాన్ తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుపాన్ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమాచారం వేగంగా చేరవేయాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

**రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

తీర జిల్లాలలో ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మోహరించామని వెల్లడించిన ముఖ్యమంత్రి.. తుపాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు.

**విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగవద్దు**

రాష్ట్రవ్యాప్తంగా 27,000 సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుఫాన్ రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ఎమర్జెన్సీ వాహనాలు సిద్ధం**

తుపాన్ రక్షణ చర్యలపై ఇప్పటివరకు 11 సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు – పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

**సముద్రంలోని పడవలను వెనక్కి పిలిపించాలి**

పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయ శాఖ–ఆర్టీజీ వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 82 మెకనైజ్డ్ పడవలు, 37 మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి మొంథా తుపాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని.. ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## పల్నాడు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు

### జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 26**
పల్నాడు జిల్లాలో సోమవారం నాడు అనగా 27వ తేదీన అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, మరియు ఇతర విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. మోంత తుఫాన్ ప్రభావంతో వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశం ఉండటంతో ప్రజల ప్రాణ భద్రత, విద్యార్థుల రక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సందర్భాల్లో మాత్రమే బయటకు రావాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను సురక్షితంగా ఉంచాలని జిల్లా యంత్రాంగం సూచించింది.




పెన్ పవర్
గుంటూరు। బాపట్ల। పల్నాడు

# మొంతా తుఫాన్ వచ్చే మూడు రోజులు ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి

## అత్యవసరం అయితే తప్ప బయటికి ఎవరు కూడా రావద్దు -జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ






**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 26**
ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ మోంత తుఫాను సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫానుకు వరదలకు చాలా తేడా ఉంది ఉందనే విషయం అధికారులందరూ గమనించాలన్నారు. వరదలకు కేవలం కృష్ణా నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు గ్రామాలపై దృష్టి పెడతారన్నారు. అదే తుఫాను వస్తే జిల్లా అంతా ప్రభావం చూపుతుందన్నారు. అన్ని గ్రామాల్లోనూ బీభత్సమైన వర్షం కురవడంతో పాటు తీవ్రమైన ఈదురు గాలులు వీస్తాయన్నారు. మోంత ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో తుఫాను హెచ్చరికలపై దండోరా వేయించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. జిల్లాకు చెడ్డ పేరు రాకుండా మండలాలు, మునిసిపాలిటీలలో సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ లు, తహసిల్దారులు, ఎసెచ్ఓలు, మండల ప్రత్యేక అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా కూడా మనుషులు గాని, పశువులు గాని ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత తుఫాను వలన గంటకు100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఆ గాలులకు విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు కూలిపోతాయన్నారు. ముఖ్యంగా తాటాకు ఇల్లు, పూరిపాకలు, మట్టి ఇల్లు, పాతబడిన ఇళ్లు బలహీనంగా ఉన్న ఇల్లు పడిపోయే అవకాశం ఉందన్నారు. అటువంటి ఇల్లతో సహా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలలోని సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. లేనిపక్షంలో ప్రాణ నష్టం జరుగుతుందని, అలా జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని, అందుకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా సహాయక శిబిరాలను ఆదివారం గుర్తించాలని, ఏఏ ప్రాంత ప్రజలను అక్కడికి తరలించాలో కూడా జాబితా ముందుగానే సిద్ధం , చేసుకోవాలన్నారు. సహాయక శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరైన విద్యుత్తు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, మంచినీరు, నిత్యవసర సరుకులు, ఆహారం వండే వంట వాళ్ళు, దోమల బెడద లేకుండా మస్కిటో కాయిల్స్ తదితర సౌకర్యాలతో ఏర్పాటు చేయాలన్నారు. అన్ని సహాయక శిబిరాల వద్ద తప్పనిసరిగా ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలను తిరిగి వారి ఇంటికి సురక్షితంగా చేర్చే బాధ్యత అధికారులు అందరిపై ఉందన్నారు. ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆదివారం రాత్రి నుండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అన్ని పనులు సజావుగా జరిగాయా లేదా అని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ పవర్ బ్యాంకులు, మొబైల్లు ముందుగానే చార్జింగ్ చేసి పెట్టుకోవాలని, కొవ్వొత్తులు బ్యాటరీ లేదా ఎమర్జెన్సీ లైట్లు సిద్ధంగా ఉంచుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది అందరూ రైన్ కోట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గాలివానకు ఎక్కడైనా చెట్లు పడిపోతే రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే వాటిని తొలగించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ ఒక్క మనిషి గాని పశువుల ప్రాణం గాని పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా రహదారులు గాని కాజ్వేలు గానీ దాటాలని కొందరు ప్రయత్నిస్తారని అక్కడ గండిపడి వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అక్కడ బాధ్యులైన వారిని కాపలా ఉంచి రాకపోకలు నియంత్రించాలన్నారు. నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పారిశుధ్యం సరిగా లేక దోమలు తదితర కీటకాలతో జబ్బులు వచ్చి మరణించే అవకాశం ఉందన్నారు. అటువంటివి జరగకుండా ముందుగానే పారిశుధ్య సిబ్బంది రంగంలోకి దిగి బ్లీచింగ్, ఫినాయిల్ తదితర పారిశుధ్య ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. నిత్యావసర సరుకులు చౌక దుకాణాలకు ఆదివారం సాయంత్రం లోగా పూర్తిగా చేరవేయాలన్నారు. మంచినీరు ఎక్కడ కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్కడైనా నీరు కలుషితమైతే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం అన్ని కాలువలలో నీటి ప్రవాహం లేదని ఎక్కడైనా పైపులు అడ్డుగా వేసి ఉంటే గస్తీ చేసి వాటిని తొలగించాలని సూచించారు. జల వనరులు, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది కలిసికట్టుగా ఈ పనులు చేయాల్సి ఉంటుందన్నారు. గాలికి ఊగులాడుతున్న ఫ్లెక్సీ లు, పాత ఫ్లెక్సీలు ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని రాకపోకల మార్గాల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుగానే జాగ్రత్త వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని తోడేందుకు కావలసిన యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, షారోన్ మండల ప్రత్యేక అధికారులు, ఎల్ డి వో లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# మొంథా తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కోవాలి..

## పులి శ్రీనివాసులు, కోవెలమూడి రవీంద్ర..







**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్,26.**
ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సిద్దంగా ఉండాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మొంథా తుఫాన్ వలన ఇబ్బందులు కలగకుండా నగరంలో తీసుకోవలసిన ముందస్తు చర్యల పై కార్పొరేటర్లు,అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ పులి శ్రీనివాసులు అత్యవసర అమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు అధికారులు మరియు కార్యదర్శులు సిద్దంగా ఉండాలన్నారు. హుద్ హుద్ వంటి ప్రమాదకర తుఫానులు వచ్చినప్పుడు సమర్ధవంతమైన నాయకత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర చర్యలు తీసుకున్నారని వారి నాయకత్వంలో ప్రస్తుత తుఫానును కూడా ఎదుర్కుందామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్ రానున్న మూడు రోడ్జుల్లో తీవ్ర గాలులతో కూడిన భారి నుండి అతిభారీ వర్షాలు కురవనున్న నెపధ్యంలో, తుఫాన్ వలన నగరంలో ఆస్తి మరియు ప్రాణ నష్టం జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న మూడు రోజులు అధికారులు మరియు కార్యదర్శులలో ఏ ఒక్కరికి సెలవులు లేవని ప్రతి ఒక్కరు విధులు కేటాయించిన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేన్నారు. వార్డు సచివాలయం కేంద్రంగా వల్నరబుల్ ప్రాంతాలు,పాత భవనాలు, పురాతన చెట్లు, వంగిన విద్యుత్ స్తంబాలను గుర్తించడం, తుఫాన్ ప్రమాదం పై ప్రజలకు అవగాహన కలిగించడం చేయాలన్నారు. రెండు వార్డులకు ఒక ప్రత్యేక అధికారితో కూడిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ (0863-2345103, వాట్సప్ నెంబర్ 9849908391) నగర పాలక సంస్థ కాన్ఫరెన్సు హాల్ లో ఏర్పాటు చేశామని, క్షేత్ర స్తాయిలో ఏ విపత్కర పరిస్థితిని గుర్తించినా వెంటనే కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించాలన్నారు. సచివాలయం పరిధిలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నోడల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో వసతి మరియు భోజనం ఏర్పాట్లను కూడా స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు. గుంటూరు నగరంలో గత అనుభవాల దృష్ట్యా ప్రగతి నగర్, మురికిపేట, తుఫాన్ నగర్, మూడువంతేనలు, కంకగుంట ఆర్.యూ.బి, జియాఉద్దీన్ నగర్, యానాది కాలని, చంద్రబాబు నాయుడు కాలని, తారకరామా నగర్, ఏ.టి అగ్రహారం, జున్ను షాహీద్ నగర్ వంటి 12 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా ప్రాంతాల పై అధికారులు ప్రత్యేక ద్రుష్టి సారించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యస్.ఓ.పి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) మేరకు తుఫాన్ ముందస్తు, తదుపరి చర్యలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎక్కడైనా అశ్రద్ధ వలన అవాంచనీయ సంఘటనలు జరిగితే సంబధిత అధికరి మరియు కార్యదర్షులే బాధ్యతవహించాలన్నారు. ఏ.పి హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా మాట్లాడుతూ, విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనే నాయకుడుగా చంద్రబాబు నాయుడుకి పేరుందని, ఆయన నాయకత్వంలో తుఫాను ప్రభావం వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ ఆదేశాలు మరియు సూచనలు పాటించుట ద్వారా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందన్నారు. డిప్యుటీ మేయర్ షేక్ సజీలా మాట్లాడుతూ, అధికారులు మరియు సచివాలయ కార్యదర్శులు తుఫాన్ ప్రభావం పై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కోవిడ్ ను టీం వర్క్ తో ఎదుర్కొన్న విధంగా తుఫాన్ ను కూడా ఎదుర్కుందామన్నారు. సదరు సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జ్ యస్.ఈ సుందర్రామి రెడ్డి, కార్పోరేటర్లు,అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సోమవారం పీజీఆర్ఎస్ రద్దు

## మూడు రోజులపాటు పాఠశాలలకు సెలవు.. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**పెన్ పవర్ గుంటూరు, అక్టోబర్ 25**
మెంథా తుఫాన్ దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ దృశ్య ప్రజలు విజ ప్రయాసలకు వచ్చి పీజీఆర్ఎస్కు రావద్దని కోరారు.

**మూడు రోజులు పాఠశాలకు సెలవులు.**
మెంథా తుఫాన్ దృష్ట్యా 27, 28,29 – మూడు రోజులు పాఠశాలలకు సెలవులను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. తల్లిదండ్రులు చిన్నారులను బయటకు వదలరాదని కోరారు. ప్రజలు తుఫాను దృష్ట్యా ఇంటి వద్దనే ఉండాలని పిలుపునిచ్చారు. తుఫానుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 2234014 ఏర్పాటు చేశామని దీంతోపాటు డివిజన్ మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. తుఫానుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలియజేయవచ్చని, అలాగే సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

# అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాం

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
### మార్టూరులో అరకు కాఫీ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి
### ఎఫర్ట్ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం
### రూ.60లక్షల సిసి రోడ్లను ప్రారంభించిన సాంబన్న




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**
ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను తీర్చే విధంగా ప్రతి పంచాయతీలో అభివృద్ధిని పరుగులు పట్టించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆదివారం మార్టూరులో ఎమ్మెల్యే ఏలూరి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత మార్టూరు హైవేపై డిఆర్డిఏ సెర్ఫ్ సహకారంతో ఏర్పాటు చేసిన అరకు కాఫీ సెంటర్‌ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,ఇది ఆరంభమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో గ్రామస్థాయిలో స్వయం ఉపాధి కార్యక్రమాలు బలపడాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మార్టూరు సుగాలి తండాలో ఎఫర్ట్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. శుద్ధమైన తాగునీరు ప్రజలకు అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా రూ.60 లక్షల విలువగల సిసి రోడ్ల పనులకు ఎమ్మెల్యే ఏలూరి శుభారంభం చేశారు. సౌకర్యవంతమైన రహదారులు గ్రామీణ జీవన విధానాన్ని మార్చుతాయని ఆయన పేర్కొన్నారు. రోడ్లు, డ్రైయిన్లు, విద్యుత్, తాగునీరు వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధి ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

**ప్రజా అవసరాలే ప్రాధాన్యం..:** ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అభివృద్దే- సంక్షేమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్ప అన్నారు.ప్రతి గ్రామం ప్రగతిపథంలో నడవాలి. అభివృద్ధి పరుగు పెట్టాలి. అందుకే అన్ని అభ్యున్నతికి కృషి చేస్తున్నాం” అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు.

# అప్రమత్తంగా ఉండండి, పుకార్లు నమ్మవద్దు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**



బాపట్ల జిల్లా పరిధిలో 'మొంథా' తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్, ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఆదివారం కలెక్టర్ కార్యలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజల భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. అధికారిక సమాచారం కోసం మొబైల్ ఫోన్ను ఛార్జ్ చేసి ఉంచుకోవాలని, అత్యవసర హెచ్చరికల కోసం ఎస్ఎంఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సోషల్ మీడియాలో లేదా ఇతరుల ద్వారా వచ్చే తప్పుడు సమాచారం, పుకార్లను నమ్మవద్దని, భయాందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని, వాహన ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ఇంటి విద్యుత్ ప్రధాన స్విచ్ను ఆఫ్ చేసి, ఎలక్ట్రిక్ ఉపకరణాలను ప్లగ్ నుంచి తీసేయాలని, తెగిపోయిన తీగలు, స్తంభాలను తాకరాదని హెచ్చరించారు. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ వైర్ల వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. శుభ్రమైన తాగునీరు, చెడిపోని ఆహారం, మందులు, టార్చ్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ముఖ్య పత్రాలు వంటి అత్యవసర కిట్ను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మత్స్యకారులు సముద్రం లేదా వాగుల్లో చేపల వేటకు వెళ్లకూడదని, సహాయం అవసరమైతే జిల్లా కంట్రోల్ రూమ్ 08643-220226 నంబర్కి సంప్రదించాలని సూచించారు. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వదిలివేయాలని, విలువైన వస్తువులు, పత్రాలను వాటర్ ప్రూఫ్ కంటైనర్లో ఉంచాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని, సమీప పీహెచ్సీలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్న పోలీసు రావు ..



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**

ఉపాధ్యాయ వృత్తిలో గత 29 సంవత్సరాల నుండి విద్యాభివృద్ధిలోను, గత 14 సంవత్సరాల నుంచి సామాజిక సేవలోను కృషిచేసిన ఇనకొల్లు పోలీస్ రావు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు మాజీ గుంటూరు, కృష్ణ ఎమ్మెల్సీ కేవిస్ లక్ష్మణరావు చేతులపై అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు రావు మాట్లాడుతూ చేస్తున్న సామాజిక సేవ ను, పాఠశాల అభివృధి చేసినందుకు గాను ఈ అవార్డును అందిచారు అని తెలిపారు. ఈ సందర్భం గా కర్లపాలెం లో ఉన్న మండల ప్రముఖులు ఆయనను అభినందించారు.

# హారిజోన్ విద్యార్థుల ప్రతిభకు రాష్ట్రస్థాయి అవకాశం

### జిల్లా ఆర్చరీ పోటీల్లో ప్రథమ స్థానంలో రాము నవదీప్, జాన్ వెస్లీ



**వేటపాలెం, పెన్ పవర్ ,అక్టోబర్ 26**

ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో హారిజోన్ పాఠశాల విద్యార్థులు ఘనవిజయం సాధించారు. 7వ తరగతి విద్యార్థులు రాము నవదీప్ మరియు కె. జాన్ వెస్లీ అద్భుత ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని హారిజోన్ పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్. రాజు, పాఠశాల సెక్రటరీ డాక్టర్ పి. రవికుమార్, జాతీయ స్థాయి విలువిద్య కోచ్లు పాల్గొని విజేత విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. రవికుమార్ మాట్లాడుతూ, "విలువిద్య కేవలం క్రీడ మాత్రమే కాదు. ఇది మానసిక శక్తి, క్రమశిక్షణ, ఏకాగ్రత వంటి విలువలను పెంపొందించే సమగ్ర సాధన" అని పేర్కొన్నారు. ఆటలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ చైర్మన్ల సమావేశం

## పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షులుగా పూనాటి శ్రీనివాసరావు ఎంపిక

## ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 26**





పల్నాడు జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ల సమావేశం ఆదివారం నరసరావుపేట మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులుగా నరసరావుపేట మండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై, రైతుల సంక్షేమం కోసం ఉమ్మడి కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మార్కెట్ యార్డ్ కమిటీలను ఏర్పాటు చేసి, వాటిని బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షులుగా పూనాటి శ్రీనివాసరావు ఎన్నిక కావడం సంతోషకరం అన్నారు. ఈ కమిటీ రైతుల ప్రయోజనాల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని నమ్ముతున్నాను అని అన్నారు. ఈ సందర్భంగా, జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీలు రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయడం, వ్యవసాయ పరికరాలను అందజేయడం, గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డ్ల ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు, సమాచారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటాం అని అన్నారు. రాష్ట్రవ్యాప్త మార్కెట్ యార్డ్ చైర్మన్ల కమిటీ ఏర్పాటు పూర్తయిన వెంటనే, ఈ కమిటీలకు నిధులు విడుదల చేయడం జరుగుతుంది అని డాక్టర్ అరవింద బాబు వెల్లడించారు. మొత్తం 12 మార్కెట్ యార్డులకు గాను 10 మార్కెట్ యార్డులకు చైర్మన్ లను నియమించారు. 2 మార్కెట్ యార్డులో చైర్మన్ ల ఎన్నిక పెండింగ్ లో ఉంది. సమావేశంలో పల్నాడు జిల్లాలోని 10 మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా జరిగేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బీజేపీ మరియు శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం...





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 26**

శంకర్ కంటి ఆసుపత్రి మరియు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు అసెంబ్లీ 55 వ డివిజన్ లోని వెంగయ్య నగర్ 4 వ లైన్ లో బీజేపీ నాయకులు గట్టుపల్లి అబ్రహం ఆధ్వర్యంలో సుమారు 200 మంది పైగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఎక్కువ మంది కంటి వైద్య పరీక్షలు చూపించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు విచ్చేసి వైద్య శిబిరం లో పాల్గొన్న పేషంట్ల తో మాట్లాడుతూ శంకర్ కంటి ఆసుపత్రి వారు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ ఏరియా లో ఈ రోజు ఇక్కడ ఈ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసుకోవడం జరిగింది అని కేవలం ఇది పేద ప్రజల కోసమే ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఈ కంటికి సంబంధించిన పరీక్షలను చూపించుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీరు ప్రత్యేకించి ఆసుపత్రికి వెళ్లి ప్రత్యేకించి ఈ వైద్య పరీక్షలు చేపించుకోవాలంటే మీకు ఎక్కువ ఖర్చుతో పాటు సమయం కూడా అవుతుంది అని అన్నారు. మీరు ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉచితంగా వైద్యం చేపించుకున్నట్లైతే మీకు మీ కుటుబానికి ఎంతో ఉపయోగపడుతుంద ని అన్నారు. పౌష్టికాహార లోపాల వల్ల మనందరికీ ఈ కంటి సమస్యలు వస్తున్నాయని ఈ రోజున చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవారు దాకా అందరికి కంటి సమస్యలు వచ్చి కళ్ళజోళు ళ్ళ పెట్టుకుంటున్నారని ఈ స్మార్ట్ ఫోన్ మాయలో పడి తల్లిదండ్రులు పిల్లలకి ఈ స్మార్ట్ ఫోన్స్ ఇవ్వటం వల్ల ఆ ప్రభావం కంటిమీద చూపిస్తుందని తద్వారా చూపు మందగిస్తుందని అన్నారు. అందుకని తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్ ల నుంచి దూరంగా ఉంచటం వల్ల కంటి చూపు తగ్గకుండా ఉంటుందని అలాగే చిన్నప్పటి నుంచే పౌష్టికాహార సంబంధించిన నాణ్యమైన తిండిని ఇవ్వటం వల్ల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు తంగా లక్ష్మణ్ రావు, మండల నాయకులు రావుల రాజశేఖర్, గణ పదర, నాగయ్య,ర్.కుమార్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనువాస్, గుంటూరు నగర అధ్యక్షులు దావులూరు కుమార్ మాదిగ మరియు శంకర్ కంటి హాస్పిటల్ రవి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా గ్రీవెన్స్ డే లో వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**పెన్ పవర్, గుంటూరు జిల్లా,అక్టోబర్ 26**

మహిళల ఫిర్యాదుతో సంపత్నగర్లో ఖాళీ స్థలాల సమస్యను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే ఖాళీ స్థలాల విషయం అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల సమస్యల పరిష్కారంలో మరోసారి తన చొరవను, ప్రజల పట్ల నిబద్ధతను చాటుకున్నారు. ఇటీవల మహిళా గ్రీవెన్స్ డే సందర్భంగా గుంటూరు 20వ డివిజన్ సంపత్నగర్ 6వ లైన్ జెండా చెట్టు ప్రాంతానికి చెందిన కొంతమంది మహిళలు తమ ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా మారి, వాటిలో విషసర్పాలు తిరుగుతున్నాయి. దోమల వల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు అని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి శనివారం స్వయంగా ద్విచక్రవాహనం పై సంపత్నగర్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించిన ఆమె చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలు పూర్తిగా చెట్లతో, పొదలతో నిండిపోయి ఉన్నాయని గుర్తించారు. వెంటనే స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బందిని పిలిపించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు ఎప్పటి నుంచో ప్రజలు చెబుతున్నారు. ఖాళీ స్థలాలపై బోర్డులు ఏర్పాటు చేయమని ముందే ఆదేశించాను. కానీ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదంటే మీ నిర్లక్ష్యం ఏంటో ఇక్కడ కనిపిస్తుందని అని ఆగ్రహం వ్యక్తం చేశారు, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఇళ్ల మధ్య చిట్టడవులు ఉండటాన్ని తానూ సహించనని స్పష్టం చేశారు. స్థల యజమానులను వెంటనే సంప్రదించి ఆ స్థలాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. స్థానిక మహిళలు మాట్లాడుతూ మేము ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా స్పందించలేదు. కానీ మా సమస్య వినగానే ఎమ్మెల్యే స్వయంగా వచ్చి చూసి వెంటనే చర్యలు చేపట్టారు. ఇది నిజంగా ప్రజాప్రతినిధిగా ఆదర్శం అని ఆనందం వ్యక్తం చేశారు.

# అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారుల ఆదేశం

**చిన్నగంజాం,పెన్ పవర్,అక్టోబర్ 26**



మోంథా తుఫాన్ నేపథ్యంలో మండల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ప్రసంత్ పిలుపునిచ్చారు. ఆదివారం చిన్నగంజాం మండల ఎంపిడిఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారివారు మండల తహసీల్దార్ జె. ప్రభాకరరావు, ఎంపిడిఓ ధనలక్ష్మి, ఇతర మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంత్ మాట్లాడుతూ, "ఈ నెల 29 వరకు కేటాయించిన విధుల్లో ఎవ్వరూ అలసత్వం ప్రదర్శించకూడదు. భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి నీరు చేరినచో బాధితులను రిలీఫ్ సెంటర్లకు తరలించి, వారికి తగిన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలి" అని ఆదేశించారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో తక్షణమే పూర్తిగా సిద్ధంగా ఉండాలని, అత్యవసర సేవలలో ఎలాంటి ఆటంకం కలుగకుండా అధికారులు సమన్వయంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రభాకరరావు, ఎంపిడిఓ ధనలక్ష్మి, పిఆర్ ఏఈ డి. దాసు, ఎపిఎమ్ సుబ్బారావు, విఅర్వో, సెక్రటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంగుపాలెం కోడూరు గ్రామ పరిధిలో చందోలు సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు.



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**

ఈరోజు సంగుపాలెం కోడూరు పరిధిలో చందోలు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివకుమార్ గారి ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయుట జరిగినది. ఈ సందర్భంగా మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి చందోలు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివకుమార్ గారిని అభినందించి మండల పరిధిలో భద్రతకు వీరు చేస్తున్న కృషిని అభినందిస్తూ మండలంలోని మిగతా గ్రామాలలో కూడా వీరి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు త్వరలో పూర్తి అవుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ గారు మాట్లాడుతూ కెమెరా ద్వారా భద్రత, నిఘా, రియల్ టైమ్ పర్యవేక్షణ మరియు సంఘటనలను రికార్డ్ చేయడం వంటివి ఇళ్ళు, కార్యాలయాలు, వ్యాపారాలు మరియు పబ్లిక్ ప్రదేశాలలో నేరాలను నివారించడానికి, దొంగతనాలను ఆపడానికి, ప్రమాదాలు జరిగినప్పుడు సాక్ష్యాలను అందించడానికి, మరియు అవాంఛిత కార్యకలాపాలను నివారించడానికి ఉపయోగపడతాయి ఈ సందర్భంగా తెలియజేశారు. ఆధునిక సీసీ కెమెరాలు పూర్తి చీకటిలో కూడా పనిచేస్తాయి మరియు 24/7 నిరంతర పర్యవేక్షణను అందిస్తాయి. రికార్డ్ చేయడం ద్వారా నేరస్థులను గుర్తించడానికి లేదా చట్టపరమైన చర్యలకు సాక్ష్యంగా ఉపయోగించవచ్చు అని తెలిపారు. గ్రామస్తులు చట్టాన్ని గౌరవించి భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని గ్రామస్తులను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో చందోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గత 24 సంవత్సరాలుగా విద్యా, సేవా రంగాలలో శ్రీ భార్గవి హై స్కూల్ డైరెక్టర్ పివి సురేష్




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**

అభినందనీయమని గుంటూరు కృష్ణా జిల్లాల మాజీఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరు రెవిన్యూ కళ్యాణ మండపంలో నేషనల్ ఏపీజే అబ్దుల్ కలాం 2025 అవార్డు ప్రధాన ఉత్సవ సభలో లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అవార్డు ప్రధాన ఉత్సవ సభ లో లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగం తో పాటుగా సుమారు 15 సంవత్సరాల పాటు జర్నలిస్టుగా పనిచేసిన సురేష్ సేవలు మరువలేనివి అన్నారు. సభలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ వహీద్ హుస్సేన్ మాట్లాడుతూ రానున్న కాలంలో సురేష్ మరిన్ని సేవా కార్యక్రమాలతో పాటుగా ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కోరారు. జన విజ్ఞాన వేదిక ప్రెసిడెంట్ వి లక్ష్మణ రెడ్డి ఎస్ పి ఎల్ టి ఓ టీచర్స్ ఆర్గనైజేషన్ నేషనల్ ప్రెసిడెంట్ పి నాగయ్య అప్సమ వైస్ ప్రెసిడెంట్ మస్తాన్రావు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కాటూరి వెంకటేశ్వరరావు అప్స స్టేట్ ట్రెజరర్ చెరుకూరి శ్రీహరి ఏసీ లా కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ రాణి శ్రీ అమృత వర్షిని పలువురు శ్రీ భార్గవి హై స్కూల్ డైరెక్టర్ పివి సురేష్ లక్ష్మీ దంపతులను దిశాలు వాళ్ళు పూలమాలలు మెమొంటోళ్లు తో ఘనంగా సత్కరించారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు





**సీ ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 26**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు ఆదివారం స్వామివారికి ప్రీతిక రమైన రోజు కావడంతో ఉదయము నుంచి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకోత్సవం, గోపూజ, మహా నైవేద్యం అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భముగా అర్చకులు మంకాళ ప్రసాద్ శర్మ పంచామృతాలతో స్వామివారి మూల విరాట్ మరియు శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను అభిషేకం పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరణ చేసి శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్య నిర్వాహణాధికారి గిరిరాజు నర సింహ బాబు, శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భజంత్రీల మేళతాళాల నడుమ వేదమంత్రాలతో గోశాలలో గోపూజ కార్యక్రమం, ఆలయ ఆవరణం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని మహా నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. ఆలయ గర్భగృహం ముందు గంటల నాదం, భక్తుల హారతుల కాంతులతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలు గోత్రనామాలతో భక్తులను ఆశీర్వదించి పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు తదుపరి భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి రవికుమార్ కుటుంబ సభ్యులు, చావా సుబ్బయ్య, సింగిల్ విండో డైరెక్టర్ తోట నారాయణ, సంగిశెట్టి రమేష్, మారెళ్ళ రవికుమార్ ఆలయ అర్చకులు, భక్తులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న సన్నిధిలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్




**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, అక్టోబర్ 26**

ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామికి కనిగిరి నియోజకవర్గం పామూరు ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్, ఆయన కుటుంబ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు.

## వాహనదారుల ఆశ్రయమా జరిమానా మేడా?

*వేటపాలెం జంక్షన్ వద్ద సన్నివేశం*





**వేటపాలెం, పెన్ పవర్ ,అక్టోబర్ 26**

తుఫాన్ హెచ్చరికలు కొనసాగుతున్నా... వేటపాలెం పోలీసులు మాత్రం తమ చర్యలకు బ్రేక్ వేయలేదు. మండలంలోని కటారిపాలెం జంక్షన్ వద్ద సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య చలిలో, వర్షంలో కూడా పోలీసులు చలాన్ వేట కొనసాగించారు."ఆపు..! ఇటు రా..! పేపర్లు చూపించు..! లైసెన్స్ ఎక్కడ?" అంటూ అకస్మాత్తుగా వాహనదారులను ఆపిన దృశ్యాలు స్థానికులను ఆశ్చర్యపరిచాయి. వర్షం పడుతుండగా, గాలులు వీచుతున్నా... చలాన్ల రాత మాత్రం ఆగలేదు. ట్రైనీ ఎస్ఐ కుంభ జగజ్జీవన్‌రావు ఆధ్వర్యంలో ఆరుగురు పోలీసులు చలాన్ ఆపరేషన్ చేపట్టారు.స్థానికుల ప్రకారం, హెల్మెట్ లేకపోవడం, లైసెన్స్ లేకపోవడం వంటి చిన్న చిన్న తప్పులకే పెద్ద మొత్తంలో జరిమానాలు విధించినట్టు తెలుస్తోంది. వర్షం మధ్య వాహనదారులను నిలబెట్టి చలాన్లు రాయడం పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు."తుఫాన్ వస్తుందని అధికారులు ప్రజలు బయటకు రాకండి అంటుంటే, పోలీసులు మాత్రం రోడ్డు మధ్య చలాన్ వేటలో ఎందుకు మునిగిపోయారు?" అని ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. "ప్రాణాలు దక్కాలా? జరిమానా కట్టాలా?" అనే సందేహం ప్రజల నోటి మాటగా మారింది.భద్రత కంటే చలాన్లపై దృష్టి పెట్టడం పోలీసుల ప్రాధాన్యతగా మారిందా? వేటపాలెం ప్రజలు ఇప్పుడు ఇదే ప్రశ్నిస్తున్నారు.

## టీడీపీ నాయకులు అబ్బూరి మల్లి జన్మదిన వేడుకలు....

### డా..సింగరాజు సాయికృష్ణ


**పెన్ పవర్, గుంటూరు జిల్లా, అక్టోబర్ 26**

ఎన్టీఆర్ భవన్ నందు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అబ్బూరి శివ నాగ మల్లేశ్వరరావు (మల్లి) పుట్టినరోజులు వేడుకలలో పాల్గొని శు భాకాంక్షలు తెలియజేస్తున్న సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులు డా" సింగరాజు సాయికృష్ణ.



## భారీ వర్షాలు దృష్ట్యా కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించి సహకరించాలని తాసిల్దార్ భాగ్యలక్ష్మి విజ్ఞప్తి





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 26**

మోథా తుఫాను ప్రభావంతో కొమరోలు మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా సమాచారం అందడంతో ప్రజల సౌకర్యార్థం కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పడి చేశామని తాసిల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. భారీ వర్షాల కారణంగా చెరువులు ,వాగులు, వంకలు ,కుంటలు నిండి ప్రజలకు ఎటువంటి ఆటంకములు లేకుండా, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం ,జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుగా కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో నెల 30వ తేదీ వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లుగా తాసిల్దార్ తెలిపారు. ఆ మేరకు తమ కార్యాలయంలో ఈనెల 25 నుంచి కంట్రోల్ ఏర్పాటు చేశామని, సదరు కంట్రోల్ రూమ్ ఈ నెల 30వ తేదీ వరకు 24 గంటలు పని చేస్తూ ఉంటుందని ఆమె తెలిపారు..కంట్రోల్ రూమ్ లో జూనియర్ అసిస్టెంట్ డి పెద్ద దేవా నాయక్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి రెండు గంటల వరకు విధులు నిర్వహిస్తారని, మరో జూనియర్ అసిస్టెంట్ పి శ్రీవిద్య మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ,ఇంకొక జూనియర్ అసిస్టెంట్ ఎస్ రంగనాయకులు రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వీఆర్వోలు వారి కార్య స్థానాల్లో ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ,అంతేకాక సమాచారాన్ని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కుతెలియజేస్తూ ఉండాలని ఆమె వీఆర్వోలను ఆదేశించారు. మండలంలోని చెరువులు, వాగులు, వంకలు, కుంటల వద్ద గ్రామ సహాయకులను కాపలాగా ఏర్పాటు చేసి ప్రాణనష్టం , ఆస్తి నష్టం ,జంతు నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అంతేకాక భారీ వర్షాల కారణంగా గ్రామాలలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వీఆర్వోలు, వీఆర్ఏలు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయం చేయాలని తాసిల్దార్ భాగ్యలక్ష్మి విఆర్ఓ వీఆర్ఏ లను ఆదేశించారు.

## రేపల్లె డివిజన్ పరిధిలో మొంతా తుఫాన్ ప్రభావం ఎక్కువుగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 26**

ఆదివారం సాయంత్రం రేపల్లె రెవిన్యూ డివిజన్ కేంద్రంలో మొంతా తుఫాన్ నేపథ్యంలో యంత్రాంగం మున్సిపల్ హై స్కూల్ నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని,ఎస్టీ కాలని ఆర్డీఓ ను,మున్సిపల్ కమిషనర్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ రేపల్లె డివిజన్ పరిధిలో మొంతా తుఫాన్ ప్రభావం ఎక్కువుగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సోమవారం ఉదయం నుండి తుఫాన్ ప్రభావం ఉంటుందని తెలిపారు. రేపల్లె డివిజన్ పరిధిలో అన్ని సచివాలయ పరిధిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు గాలులు వర్షం రావడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని,ప్రభుత్వ అధికారుల కు ప్రజలు సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల లో ఉన్న ప్రజల కోసం సచివాలయ పరిధిలో అన్ని రకాల సదుపాయాలతో పునరావాస కేంద్రాల ను ఏర్పాటు చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అధికారులకు సహకరించి పునరావాస కేంద్రాలకు చెరుకు వలన్నారు.మత్స్యకారులు ఎవ్వరు కూడా సముద్రం లోకి,కృష్ణ నదిలోకి,వాగులు వంకలు వద్దకి చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగిన ఆర్డీఓ ఆఫీసు లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజల కు చూచించారు. అంతకుముందు రేపల్లె మండలం కేంద్రంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న ఎస్టీ కాలనీ, రేపల్లె డివిజన్ కేంద్రం మున్సిపల్ హై స్కూల్ నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంను మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించారు. కాలనీ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆర్డీఓ ను ఆదేశించారు.మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ కాల్వలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. సి హెచ్ సి లో అన్నిరకాల మందులు,డాక్టర్లు సిబంది అందరూ సిద్ధంగా ఉండలని డాక్టర్లు ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ యన్.రామలక్ష్మి,మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపిడిఓ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 26**

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 14 మంది లబ్ధిదారులకు రూ. 8,16,014 మొత్తం విలువైన చెక్కులు అందజేయబడ్డాయి. పంపిణీ చేయబడిన చెక్కుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉమ్మారెడ్డి కోటిరెడ్డి (మరణించినవారు)/శివ నరసింహారెడ్డి, ఉప్పలపాడు – రూ. 1,26,163 (చెక్ నం: 509160), తడపనేని శివ కుమారి, కార్లకుంట – రూ. 55,000 (చెక్ నం: 509159), అకుల భార్గవ్ నరసరావుపేట – రూ. 40,541 (చెక్ నం: 509158), తిరుమల్లపూడి శివరామమ్మ నరసరావుపేట – రూ. 47,292 (చెక్ నం: 509157), దేవరపల్లి శివ వెంకట రెడ్డి మెరికపూడి – రూ. 76,916 (చెక్ నం: 509156), కోర్నేపాటి నాగభూషణం నరసరావుపేట – రూ. 20,000 (చెక్ నం: 509155), షేక్ మౌలాలి రొంపిచర్ల – రూ. 40,000 (చెక్ నం: 509154), తంగేడుపల్లి అజయ్ కుమార్ నరసరావుపేట – రూ. 30,000 (చెక్ నం: 509153), యనమంద్ర శ్రీనివాసరావు, నరసరావుపేట – రూ. 50,250 (చెక్ నం: 509152), పొట్టిమూర్తి పూర్ణ చంద్రరావు (మరణించినవారు)/భారతి నరసరావుపేట – రూ. 75,300 (చెక్ నం: 509151), పిట్టముద్దు రామాంజనేయులు, తురుమెళ్ల – రూ. 53,734 (చెక్ నం: 509150), ముప్వా హైమవతి ఇస్సాపాలెం – రూ. 80,000 (చెక్ నం: 509149), లింగ చిన్నమ్మ విప్పర్ల – రూ. 53,900 (చెక్ నం: 509148), బత్తుల శివ శంకర్ రొంపిచర్ల – రూ. 66,918 (చెక్ నం: 509147), ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు మరియు ప్రభుత్వం అందిస్తున్న సహాయ నిధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమం



**వేటపాలెం,పెన్ పవర్, అక్టోబర్ 26**

వేటపాలెం మండలం పందిళ్లపల్లి పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం భాగంగా ప్రజా ఉద్యమ రచ్చబండ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి వేటపాలెం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాదు రాఘవరావు నాయకత్వం వహించగా, పందిళ్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు గుత్తి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిట్టు హనుమంత్ రెడ్డి, ఆ.సోది శివారెడ్డి, వాలీ ఆదినారాయణరెడ్డి, బొజ్జ సజ్జ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రొండా శ్రీనివాసరెడ్డి, పృధ్వి ఆంజనేయులు, పిచ్చుక వెంకట్ సుబ్బారావు, చొప్పవరపు సుబ్బారావు, గుంటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.మండల మాజీ అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, బీసీ సెల్ అధ్యక్షులు యారాసు ఉమామహేశ్వరరావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఏకమయ్యేలా పిలుపునిచ్చారు. ప్రజల నుండి భారీగా స్పందన రావడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.


## రియల్ బూమ్ వారి రియల్ ఎస్టేట్ సర్వీసెస్...

### దుపిశెట్టి. శ్రీనివాస్ నాయుడు

**పెన్ పవర్, గుంటూరు జిల్లా అక్టోబర్ 26**

రియల్ ఎస్టేట్ ఏజెంట్ ల కొరకు లీడర్షిఫ్ డెవలప్మెంట్ కార్యక్రమం,శ్రీనివాసరావు తోటలోని నాయుడు హాల్ నందు ఎరపాటు చేయటం జరిగింది ముఖ్య అతిధులుగా ప్రశాంత్ రాయ్, దుపిశెట్టి. శ్రీనివాస్ నాయుడు, సవరం. రోహిత్,మహేంద్ర గురూజీ రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో రానిస్తున్న ఏజెంట్లకు, కొనుగోళ్లుదారలకు, అమ్మగోలదారాలకు ఎవరు నష్టాలు రాకుండా, లాభాలు వచ్చేలా చేయటమే రియల్ బూమ్ టీం ముఖ్య ఉద్దేశం.





# మెడికల్ కాలేజీలను ప్రైవేట్ కు అమ్మటం కూటమి ప్రభుత్వానికే చెల్లింది

### బుర్రా మధుసూదన్ యాదవ్ -కూటమి నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్.

### కందుకూరులో సంక్షేమం, అభివృద్ధి కొరవడిందన్న బుర్రా -సాలిపేటలో కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న బుర్రా







**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబర్ 26:**

మండలంలోని సాలిపేట పంచాయితీలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. బుర్రా మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా వైయస్సార్సీపీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని బుర్రా అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పజెబుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, మాజీ సీఎం వైయస్ జగన్ నిర్మించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలనే డిమాండ్ పై ప్రజల్లోనూ చైతన్యం తీసుకురావాలని వైయస్సార్సీపీ సంకల్పించిందని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆందోళనను ప్రజల అభిప్రాయంగా సంతకాల రూపంలో రాష్ట్ర గవర్నర్‌కి సమర్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు నానాటికి దిగజారి పోతున్నాయని ఎమ్మెల్యే అవినీతిలో కూరుకుపోయి రేషన్ బియ్యం దందా, ఇసుక మట్టి మాఫియా, నకిలీ మద్యం, పేకాట శిబిరాలు తన అనుచరులతో నిర్వహిస్తూ కమిషనులు దన్నుకోవడం సరిపోతుందని అన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ అభివృద్ధి కొరవడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అశేషంగా గ్రామ ప్రజలు పాల్గొని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, వైస్ ఎంపీపీ మోరబోయిన శ్రీరాములు, మండల ఉపాధ్యక్షులు చాసల బాలాజీ, కాట్రగడ్డ వెంకట్రావు, తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, బిల్లా రమణయ్య,కంప రాజు సాంబశివరాజు, రషీద్, గొర్ల రమేష్, ఈర్ల వెంకటేశ్వర్లు, కాపులూరి సుబ్బరాయుడు, కాపులూరి మధు, నక్కల రామకృష్ణ, కంచర్ల మాధవ, నక్కల శరత్, దేవ్ కుమార్, తాటిపర్తి రమేష్, సన్నిబోయిన రామ్మూర్తి, వెంకట కృష్ణయ్య, ఎందేటి సుబ్బారావు, సన్నె బోయిన శ్రీరామ్ మూర్తి, సన్నె బోయిన రాజశేఖర్, సన్నె బోయిన శ్రీను, శ్రీను, బాలాజీ, మనోహర్, ఎందేటి రమేష్, శ్రీనాథ్, కే సుధాకర్, చిన్న రాముడు, వెంకట శేషయ్య, ఏడుకొండలు, నాగేశ్వరరావు, వేల్పుల రామారావు, బి నరేంద్ర, యేసు, ఏలూరు రమేష్, ఎర్రగర్ల నరసింహారావు, తల్లపనేని గోపి, అప్పనబోయిన రాజేష్, కాపులూరి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, అక్టోబర్ 26**

మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇంచార్జి డా. దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు కనిగిరి మండల వైయస్ఆర్ సిపి అధ్యక్షులు మడతల కస్తూరి రెడ్డి ఆధ్వర్యంలో చీరలదిన్నె గ్రామ పంచాయతీలోని పాతపాడు గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా "కోటి సంతకాల సేకరణ" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అట్ల రామచంద్రారెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, ద్వారసాల శేసిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, ఆవుల కృష్ణారెడ్డి, మార్తాల వెంకటేశ్వర రెడ్డి, ద్వారసాల చిన్న వెంకటరెడ్డి, మార్తాల రమణారెడ్డి, మార్తల రామిరెడ్డి, మార్తాల లక్ష్మిరెడ్డి, మార్తాల రమణారెడ్డి, కర్నాట వెంకటరెడ్డి, రామచంద్రపూ హైజాకు, చెన్నూరు అరుణ్, ముంగర ఆదాం, గోడ ఓబుల్ రెడ్డి, కొప్పర్తి జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత తుఫాన్ కారణంగా అధికారులు అప్రమత్తం కావాలి

**పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్ 26**

జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి పొన్నలూరు మండల స్పెషల్ ఆఫీసర్ స్పెషల్ ఆఫీసర్ సువార్తమ్మ అధ్యక్షతన మండలంలోని వాగుల వద్ద నీటి ప్రవాహలను పరిశీలించారు. ముందస్తు చర్యలలో భాగంగా పాలేరు వాగు దగ్గర లోని పరుచూరివారి పాలెం, కల్లూరి వారి పాలెం మధ్యలో గల పాలేరు వాగు దారిలో నీటిపారుదల ఎక్కువగా ఉండటం వలన అటు వైపు గా గ్రామ ప్రజలు వాగు దాటకుండా ఉండుటకు జెసిబి ద్వారా చిల్ల చెట్లుతో కంచె వేయించటం జరిగింది. అదేవిదంగా అగ్రహారం, కోటపాడు మధ్యలో గల పాలేరు వాగు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా మన మండల స్పెషల్ ఆఫీసర్ గారి ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది, ఎలాంటి అవంచినియా సంఘటనలు జరగకుండాసంఘటనలు ఉండే విదంగా వాగు వద్ద సచివాలయ ఉద్యోగస్తులను, పోలీస్ వారిని డ్యూటీ వేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత శ్రావణి పంచాయితీ కార్యదర్శులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







## 28న కొమరోలులో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ, తాసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమాలను జయప్రదం చేయండి

### మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయటాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్సిపి చేపట్టిన ప్రజా ఉద్యమం.



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 26**

ప్రభుత్వ నూతన మెడికల్ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయుటకు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 28వ తేదీ మంగళవారం కొమరోలు నిర్వహించే ర్యాలీ తాసిల్దార్ గురించి సమర్పణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కొమరోలు జెడ్పిటిసి సభ్యులు సారి వెంకటనాయుడు మండల వైసిపి సీనియర్ నాయకులు వైసీపీ మండల కన్వీనర్ మేరిగ రవికుమార్, మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మౌలాలి కొమరోలు ఎంపిటిసి సభ్యులు ఎస్ఎం సుభాని ఎన్ తిరుపతి రాజు మండలంలోని వైసీపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కొమరోలు లోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు మాట్లాడుతూ, 2019-2024 మధ్యకాలంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం పేద ,మధ్యతరగతి విద్యార్థులు, ప్రజల ప్రయోజనం కోసం జిల్లాల వారీగా 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి వాటి నిర్మాణాలను చేపట్టిందని అన్నారు. నూతన మెడికల్ కాలేజీల వలన పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా మెడికల్ చదువులు అందుబాటులోకి వస్తాయని, అంతేకాక పేద మధ్యతరగతి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా కూడా నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి రాగలదనే ఆశయంతో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీలన ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని అన్నారు. అయితే ప్రస్తుతం నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయుటకు ప్రయత్నిస్తున్నదని, తద్వారా పేద విద్యార్థులకు మెడికల్ చదువు అందనంత దూరంలో ఉంటుందని, ఫీజులు కూడా విపరీతంగా పెరిగి పేద విద్యార్థులపై, వారి తల్లిదండ్రులపై పెను భారం పడుతుందని ఆయన తెలిపారు . ఇక పేద మధ్యతరగతి ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్య సేవలు ఎండమావిగా మారగలవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ,వైఎస్ఆర్సిపి వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టారని అన్నారు. అందులో భాగంగా ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతి పత్రం సమర్పించే కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర వైసీపీ కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చినదని అన్నారు. ఆ మేరకు ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మార్కాపురం మాజీ శాసనసభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో కొమరోలులో ర్యాలీ నిర్వహించి, అనంతరం తాసిల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామన్నారు. ఆ కార్యక్రమానికి కుందూరు నాగార్జున రెడ్డి ,జిల్లాస్థాయి వైసిపి నాయకులు, గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన వైసిపి నేతలు, శ్రేణులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. కావున ఈనెల 28న కొమరోలు లో నిర్వహించే ర్యాలీ, తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాలకు కొమరోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి వైసీపీ నేతలు,,కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని వెంకట నాయుడు పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం సాహెబ్, మండల వైసీపీ నాయకులు సారే జనార్ధన్ నాయుడు , చెదుళ్ళ వెంకటరమణారెడ్డి, వీరం రెడ్డి మోహన్ రెడ్డి, బంగారు రత్నాలు, గోల్కొండ అబ్దుల్ సుభాన్, అవినాష్ అల్లినగరం ఎంపీటీసీ సభ్యులు జాజం వెంకటరమణ, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు బంగారు విశ్వరూపం, పలు గ్రామా పంచాయతీల సర్పంచ్ లు, వైసిపి నేతలు గుడిపాటి ప్రసాద్, ఉల్లాపు రామచంద్రుడు, సింగరయ్య, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కుమారుడి బారసాలకు హాజరైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 26**

ఢిల్లీ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు నివాసంలో జరిగిన రామ్మోహన్ నాయుడు కుమారుడి బారసాల కార్యక్రమంలో ఉత్సవం లో ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ,కడ పోలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని ఆశీర్వదించి, రామ్మోహన్ నాయుడు కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రులు రాజ్నాథ్ సింగ్, జేపీ నడ్డాను, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ దేవుని ఆశీస్సులతో తాత ఎర్రంనాయుడు లాగా, తండ్రి రామ్మోహన్ నాయుడు లాగా గొప్ప నాయకుడిగా చిన్నారి ఎదిగి ప్రజలకు సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు ప్రముఖులతో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ముచ్చటించారు.





## భక్తులు భైరవకోన జలపాతానికి దూరంగా ఉండాలి

### సి ఐ భీమా నాయక్

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 26**



జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక శైవక్షేత్రమైన భైరవ కోనలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోందని భక్తులు, పర్యాటకులు జల పాతం సమీప ప్రాంతాలకు వెళ్ల కూడదని పామూరు సీఐ భీమా నాయక్ హెచ్చరించారు. వాతా వరణ శాఖ జారీ చేసిన తుఫా ను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు తుఫాన్ ప్రభావం ఉండటంతో కార్తీకమాస పవిత్ర స్నానాలు ఆచరించే భక్తులు భైరవకోనకు రావద్దని అలాగే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జలపాతం భారీ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం అలాగే భైరవకోనకు వచ్చే రహదారులు కల్వర్టు మీద నీరు అధికంగా ప్రవహిస్తుందని, భక్తులు భద్రత కారణంగా ఆ ప్రాంతానికి తాత్కాలికంగా వెళ్లకూడదని సూచించారు.భైరవకోన లోని పరిసర ప్రాంతాల్లో ప్రతిరోజు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారని. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి జలపాతం దగ్గరకు వెళ్లినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. భక్తులు పర్యాటకులు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించవద్దు

### మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పాలుగుళ్ల మల్లికార్జున్ రెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 26**

ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేట్ వారికి అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు మండలంలోని ఆనికాళ్లపల్లి గ్రామంలో వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రకాశం జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి మరియు కనిగిరి నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంచార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు మండల వైయస్ఆర్ సిపి అధ్యక్షులు పాలుగుల్ల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామస్తులతో సంతకాలు సేకరించారు ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వము మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం ఉంటుందని, ప్రభుత్వ విద్యా వైద్య రంగాలను కార్పొరేట్ లకు అప్పగించడం అన్యాయమని పేర్కొన్నారు పేద విద్యార్థులు చదివి వైద్యులు కావడానికి అవకాశం కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో అనికాలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి రాధా కృష్ణా రెడ్డి, మండల వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భువనగిరి వెంకటయ్య,ప్రకాశం జిల్లా టి యు సి సి అధ్యక్షులు మితికెలా గురవయ్య,సి యస్ పురం ఎంపీటీసీ మన్నెపల్లి పెద్దన్న,బోయమడుగుల ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతి రెడ్డి,మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులు ఆత్మహత్య



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 26**

పట్టణంలోని కోవూరు రోడ్ జనార్ధన కాలనీ లో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులు పువ్వాడి పున్నయ్య (82) పువ్వాడి రోశమ్మ (70) ఆదివారం తమ ఇంటిలో అనారోగ్య సమస్యల వలన పురుగు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్ఐ శివ నాగరాజు తెలిపారు. రాబడిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ నాగరాజు తెలిపారు.

## గిద్దలూరు టౌన్ మార్కెట్ యార్డ్ సమీపంలో ఎదురెదురుగా బైకులు ఢీ -నలుగురికి గాయాలు

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 26**

గిద్దలూరు మార్కెట్ యార్డు సమీపంలో గిద్దలూరు నుండి పల్గుంటి పల్లెకు చెందిన వ్యక్తులు బైకు పై పలుగుంటి పల్లెకు వెళ్తున్న వేణు ,నవీన్ ,వెంకటేష్ అనే వ్యక్తులు ఓవర్టేక్ చేయడంలో తురిమెళ్ళ నుండి గిద్దలూరు కు వస్తున్న మాబు హుస్సేన్ అనే వ్యక్తి బైక్ ను ఢీకొనడంతో ప్రమాదవశాత్తు బస్సు మాబు హుస్సేన్ ఢీ కొట్టారు దీంతో తీవ్ర గాయాలు మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా వారిని వెంటనే 108 ద్వారా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# భజన భజన... పాక్ పెద్దలపై ట్రంప్ పొగడ్తల వర్షం!



**హైదరాబాద్ పెన్ పవర్:** గతం మరిచిపోయో ఏమో తెలియదు కానీ గత కొంతకాలంగా పాకిస్థాన్ తో తెగ రాసుకు పూసుకు తిరిగేస్తున్నారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ కు ప్రత్యేక విందు ఇస్తున్నారు.. పాక్ ప్రధానితో కలిసి తిరుగుతున్నారు.. అంతర్జాతీయ వేదికలమీద అడిగిమరీ పొగిడించుకుంటున్నారు. ఈ క్రమంలో ట్రంప్ కూడా భజన మొదలుపెట్టడం గమనార్హం!అవును... ఇజ్రాయెల్ – హమాస్ ల యుద్ధం ముగింపునకు సంబంధించి ఈజిప్టులో శాంతి ఒప్పందం జరిగిన సందర్భంగా ట్రంప్ ని ఉద్దేశించి ప్రసంగించిన పాకిస్థాన్ ప్రధాని షరీఫ్... తన ఐదు నిమిషాల ప్రసంగంలో ట్రంప్ పై పొగడ్తల వర్షం కురిపించారు. ఇందులో భాగంగా... అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో అవిశ్రాంత ప్రయత్నాల తర్వాత గాజాలో శాంతి సాధన అయ్యిందని అన్నారు.ఇదే సమయంలో.. ట్రంప్ ఈ ప్రపంచాన్ని శాంతి, శ్రేయస్సుతో జీవించేలా చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడుతూ... శాంతిని పెంపొందించడానికి ట్రంప్ చేసిన అద్భుతమైన, అసాధారణ కృషికి గుర్తింపుగా.. పాకిస్తాన్ ఆయనను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసింది. ఆయన ప్రేమకు మనం చేయగలిగినది ఇదేనని నేను భావిస్తున్నాను అని అన్నారు.

**ఇప్పుడు ట్రంప్ వంతు..!:**

ఓ పక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్ మునీర్ లు పొగడ్తల వర్షాలు కురిపిస్తోన్న వేళ.. ఆదివారం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధిపతి అసిమ్ మునీర్ లను డొనాల్డ్ ట్రంప్ ప్రశంచించారు. ఇందులో భాగంగా వారిరువురూ గొప్ప వ్యక్తులు అని అన్నారు. ఇదే సమయంలో.. పాకిస్తాన్ – ఆఫ్గనిస్తాన్ వివాదాన్ని త్వరగా పరిష్కరిస్తానని ప్రతిజ్ఞ చేశారు.మలేషియాలోని కౌలాలంపూర్ లో జరిగిన ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన సందర్భంగా థాయిలాండ్ – కంబోడియా శాంతి ఒప్పందంపై సంతకం చేసిన సమయంలో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన ట్రంప్.. తన పరిపాలనలోని ఎనిమిది నెలల్లో ముగించిన ఎనిమిది యుద్ధాలలో ఇది (థాయ్ – కంబోడియా మధ్య ఘర్షణ) ఒకటి అని అన్నారు.ఈ నేపథ్యంలోనే... 'పాకిస్తాన్ %–% ఆఫ్గనిస్తాన్ మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయని విన్నప్పటి నుంచి దాన్ని ఆపడం మిగిలి ఉందని భావిస్తున్నాను.. నేను దానిని చాలా త్వరగా పరిష్కరిస్తాను.. నాకు వారిద్దరూ తెలుసు.. పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్, ప్రధాన మంత్రి గొప్ప వ్యక్తులు, మేము దానిని త్వరగా పూర్తి చేయబోతున్నాం అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు' అని ట్రంప్ అన్నారు.

**ఇదే ఫస్ట్ టైమ్ కాదు..!:**

పాకిస్థాన్ ప్రధాని, ఆర్మీ చీఫ్ లపై పొగడ్తల వర్షం కురిపించడం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది సెప్టెంబర్ లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కోసం అమెరికాలో ఉన్నప్పుడు పాకిస్తాన్ ప్రధాని.. ట్రంప్ ను వైట్ హౌస్ లో కలిశారు. వారి సమావేశానికి ముందు ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ వారిని తెగ ప్రశంసించారు.ఇందులో భాగంగా.. "వాస్తవానికి, మనకు ఒక గొప్ప నాయకుడు వస్తున్నారు.. పాకిస్తాన్ ప్రధాన మంత్రి వస్తున్నారు.. పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ వస్తున్నారు.. ఫీల్డ్ మార్షల్ చాలా గొప్ప వ్యక్తి.. ప్రధాన మంత్రి కూడా అంతే.. వారు వస్తున్నారు.." అని చెప్పుకొచ్చారు. మరోవైపు, అసిమ్ మునీర్ ఈ సంవత్సరం రెండుసార్లు వాషింగ్టన్ కు వెళ్లారు.

# కింజరాపు ఫ్యామిలీలో కొత్త సంబరం... పిక్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** కింజరాపు ఫ్యామిలోకి ఇటీవల వారసుడొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మరోసారి తండ్రయ్యారు. రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు పండంటి మగబిడ్డ జన్మించాడు. శ్రావ్య ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఆగస్టు 13న పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఆ బిడ్డకు నామకరణ వేడుక జరిగింది.అవును... రామ్మోహన్ నాయుడికి తొలి సంతానంగా పాప ఉండగా.. రెండో సంతానంగా బాబు పుట్టిన సంగతి తెలిసిందే. కింజరాపు ఫ్యామిలీలోకి వారసుడు రావడంతో ఎర్రన్నాయుడు మళ్లీ పుట్టారంటూ కింజరాపు కుటుంబ అభిమానులు సంతోషంలో ఉన్నారు. వారి సంతోషాన్ని రెట్టిపుచేస్తూ అన్నట్లుగా.. ఎర్రన్నాయుడు గౌరవార్థం ఆ బిడ్డకు ప్రేమగా శివన్ ఎర్రన్నాయుడు అని పేరు పెట్టారు.ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి అనేక మంది నాయకులు హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో పాటు రామ్మోహన్ నాయుడి బాబాయ్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు హాజరయ్యారు. వీరితోపాటు సన్నిహితులు, శ్రేయోభిలాషులు, రాజకీయ సహచరులు హాజరై చిన్నారికి ఆశీస్సులు అందించారు.కాగా... రామ్మోహన్ నాయుడు, శ్రావ్యల వివాహం 2017లో జరిగింది. వీరికి తొలి సంతానంగా పాప ఉండగా.. రెండో సంతానంగా బాబు పుట్టాడు. రామ్మోహన్ నాయుడు 2014,2019, 2024 ఎన్నికల్లో వరుసగా టీడీపీ తరఫు ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం కేంద్రమంత్రి వర్గంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు.

**రామ్మోహన్ నాయుడు కుమారుడికి లోకేష్ ఆశీస్సులు!:**

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష.. గత నెల మొదటివారంలో ఢిల్లీలోని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా... రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు జన్మించిన కుమారుడిని ఆయన ఆశీర్వదించారు. బాబును ఎత్తుకొని ముద్దాడారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మాజీమంత్రి బండారు సత్యనారాయణ మూర్తి సతీమణి మాధవీలతని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

# షాకింగ్... దేశంలో ఐదు మంది పిల్లలకు హెచ్.ఐ.వీ. పాజిటివ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యంలో నిర్లక్ష్యం జరిగితే ఎలాంటి ఘోరాలు జరుగుతాయనేది తెలిపే మరో షాకింగ్ ఘటన జార?ండ్ లో తెరపైకి వచ్చింది. పశ్చిమ సింగ్ భూమ్ జిల్లాలో వైద్య నిర్లక్ష్యం కారణంగా దిగ్భ్రాంతికరమైన కేసు బయటపడింది! ఇందులో భాగంగా... చైబాసాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త మార్పిడి తర్వాత ఏడేళ్ల తలసేమియా రోగితో సహా కనీసం ఐదుగురు పిల్లలకు హెచ్.ఐ.వీ. పాజిటివ్ ఉన్నట్లు తెలిసింది.అవును.. వైద్యం నిర్లక్ష్యం కారణంగా పాపం పుణ్యం తెలియని ఐదుగురు పిల్లలకు హెచ్.ఐ.వీ. పాజిటివ్ ఉన్నట్లు తేలిన ఘటన జార?ండ్ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది.. దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన అంతటా ఆగ్రహాన్ని, భయాందోళనలను రేకెత్తించింది. దీనితో రాంచీ నుండి ఉన్నత స్థాయి వైద్య బృందం తక్షణ దర్యాప్తు చేపట్టింది.శుక్రవారం చైబాసా సదర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ లో తలసేమియా బాధిత బాలుడికి హెచ్.ఐ.వీ. సోకిన రక్తం ఎక్కించారని అతని కుటుంబం ఆరోపించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. శనివారం బృందం తనిఖీ సమయంలో.. తలసేమియాతో బాధపడుతున్న మరో నలుగురు పిల్లలు హెచ్.ఐ.వీ. పాజిటివ్ గా ఉన్నట్లు తేలింది. దీనితో ప్రభావితమైన మైనర్ల మొత్తం సంఖ్య ఐదుకు చేరుకుంది.ఈ విషయం వెలుగులోకి రావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ దినేష్ కుమార్... తలసేమియా రోగికి కలుషితమైన రక్తం ఎక్కించబడిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని.. దర్యాప్తు సమయంలో బ్లడ్ బ్యాంకులో కొన్ని వ్యత్యాసాలు బయటపడ్డాయని.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు.

ఈ నేపథ్యంలో... డాక్టర్ శిప్రా దాస్, డాక్టర్ పాశ్వాన్, డాక్టర్ భగత్, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సుశాంత్ కుమార్, డాక్టర్ శివచరణ్, డాక్టర్ మిను కుమారిలతో కూడిన దర్యాప్తు బృందం బ్లడ్ బ్యాంక్ కేంద్రంతో పాటు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) రెండింటినీ తనిఖీ చేసింది. ఈ సందర్భంగా... బాధిత పిల్లల కుటుంబాలతో కూడా ఈ బృందం మాట్లాడింది.ఈ సందర్భంగా స్పందించిన జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సుశాంత్ కుమార్.. ఇన్ఫెక్షన్ ఎలా వ్యాపిస్తుందో తెలుసుకోవడానికి సమగ్ర దర్యాప్తు జరుగుతోందని అన్నారు. అయితే, రక్త మార్పిడి ద్వారా మాత్రమే ఇన్ఫెక్షన్ వచ్చిందని నిర్ధారించడం తొందరపాటు అవుతుందని.. కలుషితమైన సూదులకు గురికావడం వంటి ఇతర కారణాల వల్ల కూడా హెచ్.ఐ.వీ. సంక్రమణ సంభవించవచ్చని పేర్కొన్నారు.

# సల్మాన్ ను ఉగ్రవాదిగా ప్రకటించిన పాక్.. థాంక్స్ చెప్పిన బలుచిస్తాన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్ ను పాకిస్థాన్ ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది! ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా సల్మాన్ ఖాన్ ను నాల్గవ షెడ్యూల్ లో ఉంచింది. ఈ జాబితా ఉగ్రవాద నిరోధక చట్టం కిందకు వస్తుంది. ఇందులో వ్యక్తులు పాకిస్తాన్ లో చట్టపరమైన చర్యలకు లోబడి ఉంటారు. దీంతో ఈ విషయం ఒక్కసారిగా వైరల్ గా మారింది.అవును... సల్మాన్ ఖాన్ ను ఉగ్రవాదిగా ప్రకటిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది! ఈ మేరకు దీనిపై ఆ దేశ ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. సల్మాన్ ఖాన్ పై పాకిస్థాన్ ప్రభుత్వం ఈ రేంజ్ లో నిర్ణయం తీసుకోవడానికి ఆయన చేసిన ఆ ప్రసంగం, పాక్ కు అంతగా కోపం తెప్పించిన ఆ మాటలేమిటనేది ఇప్పుడు చూద్దామ్... ! వివరాల్లోకి వెళ్తే... సల్మాన్ ఖాన్ ఇటీవల సౌదీ అరేబియాలో జరిగిన 'జాయ్ ఫోరం 2025' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైకందుకున్న ఆయన... బలూచిస్తాన్ ను ప్రత్యేక దేశంగా చెబుతూ మాట్లాడారు. దీంతో.. ఈ వ్యాఖ్యలపై పాకిస్థాన్ రగిలిపోవడం మొదలుపెట్టింది. మరోవైపు సల్మాన్ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఇంతకీ సల్మాన్ ఖాన్ ఏమన్నారంటే.. "భారతీయ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది.. ఒక హిందీ సినిమాను సౌదీ అరేబియాలో విడుదల చేస్తే తప్పకుండా సూపర్ హిట్ అవుతుంది.. ఆపై తెలుగు, తమిళ్, మలయాళ సినిమాలు కూడా ఇక్కడ కోట్ల రూపాయలు రాబడుతున్నాయి. దీనంతటికీ కారణం పలు దేశాలకు చెందిన ప్రజలు సౌదీలో ఉండటమేనని చెప్పాలి" అని మొదలుపెట్టారు.

అనంతరం... "బలూచిస్తాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు" అని సల్మాన్ ఖాన్ కొనసాగించారు. అంటే... ఈ మాటల్లో బలూచిస్తాన్ వేరే దేశం అనే అర్థం వచ్చే విధంగా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై బలుచిస్తాన్ వేర్పాటు వాదులు సల్మాన్ కు సోషల్ మీడియా వేదికగా థాంక్స్ చెబుతూ పోస్టులు పెడుతున్నారు.

ఇందులో భాగంగా... 'సల్మాన్ నిజం మాట్లాడారు.. బలూచిస్థాన్ ఒక ప్రత్యేక దేశం యొక్క భూమి.. ఇది ఒక చారిత్రక వాస్తవం.. బలూచిస్థాన్ పాకిస్తాన్ లో భాగం కాదు.. అది ఆక్రమిత భూభాగం.. మేము బలూచిస్థాన్ నుండి సల్మాన్ బాయ్ ని ప్రేమిస్తున్నాము' అంటూ పోస్టులు పెడుతున్నారు'. దీంతో పాకిస్థాన్ ప్రభుత్వం మరింత రగిలిపోయింది!

కాగా.... ఖనిజ వనరులతో సమృద్ధిగా ఉన్న బలూచిస్తాన్ చాలా వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది. ఇక్కడ ఖనిజ వనరులు పాకిస్థాన్ ఖజానాకు వరంగా మారాయి. ఒక్కమాటలో చెప్పాలంటే... ఈ ప్రాంతంలో ఉన్న బంగారం, బొగ్గు, రాగి, చమురు ఆ దేశ ఖజానాను కాపాడుతున్నాయి. అయినప్పటికీ.. బలూచిస్తాన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పాక్ నిర్లక్ష్యంగానే ఉంటోంది.దీంతో... పాక్ ప్రభుత్వ వైఖరిపై బలుచిస్తాన్ ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఫలితంగా రాజకీయ అనిశ్చితి ఏర్పడటం, ఆపై వేర్పాటువాదులు శక్తిమంతమవ్వడం జరిగింది. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక ఆర్మీని ఏర్పాటు చేసుకునే స్థాయికి బలూచిస్తాన్ చేరుకుంది. చాలా కాలంగా పాక్ కు పక్కలో బల్లెంలా తయారైంది. ఈ నేపథ్యంలో.. బలుచిస్తాన్ ను ప్రత్యేక దేశంగా సల్మాన్ ప్రస్థావించేసరికి పాక్ రగిలిపోతుంది!

# పవన్ అపాయింట్మెంట్ ఇస్తే భీమవరం గుట్టు రట్టు చేస్తా !



**హైదరాబాద్ పెన్ పవర్:** భీమవరం డీఎస్పీ ఇష్యూ గోదావరి జిల్లాలలో ఇపుడు హాట్ టాపిక్ గా మారింది. పవన్ ఏ ముహూర్తాన ఆయన పైన సీరియస్ అయ్యారో తెలియదు కానీ అది రాజకీయంగానూ ప్రకంపనలు సృష్టిస్తోంది. డీఎస్పీ మీద నివేదిక ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కోరారు. ఆ మీదట హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ పవన్ ఈ విషయంలో జోక్యం చేసుకోవడంలో తప్పులేదని అన్నారు. ఇక భీమవరం డీఎస్పీ మంచి వారే అని ఉప సభాపతి రఘురామ క్రిష్ణం రాజు కూడా చెప్పారు. ఇపుడు ఈ ఇష్యూలోకి భీమవరం నుంచి 2019లో వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి పవన్ ని ఓడించిన గ్రంధి శ్రీనివాస్ ఎంట్రీ ఇచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భీమవరం డీఎస్పీ విషయంలో రఘురామ చెప్పిందే నూరు శాతం నిజం అని చెప్పడం విశేషం అయితే భీమవరంలో చాలానే జరుగుతున్నాయని వాటి మీద మొత్తం గుట్టుమట్లు అన్నీ పవన్ ని స్వయంగా కలిసి అన్ని విషయాలు తానే స్వయంగా వివరిస్తారు అంటున్నారు.

**గుట్టు రట్టు చేస్తా :**

భీమవరంలో ఏమి జరుగుతోంది పేకాట జూదాల వెనక ఏమిటి అసలు మ్యాటర్ ఎవరేంటి ఈ దందా వెనక ఎవరున్నారు అన్న దాని మీద మొత్తం గుట్టుని తాను విప్పుతాను అని గ్రంధి శ్రీనివాస్ అంటున్నారు. ఇక డీఎస్పీ జయసూర్య మీద కూటమిలో కొందరు మద్దతుగా మాట్లాడుతూంటే మరికొందరు వ్యతిరేక గళం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం డీఎస్పీకే మద్దతుగా మాట్లాడడం విశేషంగా అంతా చూస్తున్నారు. అంతే కాదు ఆయన కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గడచిన పదిహేడు నెలల కాలంలో పద్నాలుగు నెలల పాటు సాగిన పేకాట దందాలను ఉక్కు పాదంతో డీఎస్పీ అణచివేశారు అని చెప్పారు. అందుకే ఇపుడు ఆయన మీద పనిగట్టుకుని కొంతమంది పవన్ కి ఫిర్యాదు చేశారు అని హాట్ కామెంట్స్ చేశారు. దీంతో ఇది ఒక్కసారిగా కూటమిలోనూ సీరియస్ చర్చకు తావిస్తోంది.

**స్పందించడం అభినందనీయం :**

భీమవరంలో పేకాట జూదం వంటి విషయంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ స్పందించడం అభినందనీయం అని అంటున్నారు. అయితే అసలు విషయాలు చాలానే ఉన్నాయని గ్రంధి శ్రీనివాస్ చెప్పడం గమనార్హం. భీమవరంలో ఏమి జరుగుతోంది అన్నది పవన్ కి పూర్తిగా తెలియచేయాలన్నది తన ఉద్దేశ్యం అన్నారు. అందుకే తానే స్వయంగా పవన్ కి తొందరలో కలసి అసలు భీమవరంలో ఏమి జరుగుతోంది అన్నది పూర్తి స్థాయిలో వివరిస్తాను అని సంచలన ప్రకటన చేశారు. భీమవరంలో జూద శిబిరాల లోగుట్టు ఏంటో పవన్ కే అన్ని విషయాలు చెప్పి లోగుట్టు పూర్తిగా బట్టబయలు చేస్తాను అని గ్రంధి శ్రీనివాస్ అంటున్నారు. అయితే తనకు పవన్ అపాయింట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన చెబుతున్నారు.

**మామూళ్ళు ఆగిపోయాయనే :**

ఇంతటితో గ్రంధి శ్రీనివాస్ ఊరుకోలేదు. మామూళ్ళు ఆగిపోయాయనే కొందరు పనిగట్టుకుని భీమవరం డీఎస్పీ మీద లేని పోనివి పవన్ కి చెప్పారు అని ఆయన అంటున్నారు. క్లబ్ ల ద్వారా భారీగా అక్రమార్జన గత పద్నాలుగు నెలలుగా కొందరికి దక్కిందని గడచిన మూడు నెలలుగా అది ఆగిపోవడంతోనే వారు ఈ రకంగా చేస్తున్నారు అని అన్నారు. ఇంతకీ ఎవరు వారు అని మీడియా ప్రశ్నించగా ఎవరేమిటో భీమవరం ప్రజలు అందరికీ తెలుసు అన్నారు. ఒక్కసారి వారిని అడిగితే అంతా తెలుస్తుందని అన్నారు. ఈ విషయంలో పూర్తి సమాచారం తన దగ్గర ఉందని కూడా గ్రంధి చెప్పడం విశేషం.

**అసలు మ్యాటర్ ఏంటో :**

భీమవరం డీఎస్పీ విషయం, అలాగే జూద శిబిరాల వెనక దందాలు అసలు గుట్టు ఏమిటి అన్నది తనకు తెలుసు అని మాజీ ఎమ్మెల్యే చెప్పడం విశేషం. ఇవన్నీ కూడా పవన్ కే పూర్తి సమాచారం ఇస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు ఆయన పవన్ ని కలిస్తే కేవలం భీమవరం పేకాట జూదం గురించే కాకుండా మొత్తం రాజకీయాల గురించి కూడా పూర్తి సమాచారం ఇచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. ఎవరేమిటి అన్నది కూడా ఆయన వివరిస్తారు అని అంటున్నారు.

**గ్రంధి రాజకీయమేంటి :**

ఇదిలా ఉంటే గ్రంధి శ్రీనివాస్ ఒకనాడు పవన్ ని ఘాటుగా విమర్శించారు. ఆయన వైసీపీలో అయిదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా ఉన్నపుడు పవన్ మీద తీవ్ర స్థాయిలోనే విమర్శలు చేసేవారు. అయితే 2024లో ఓటమి పాలు అయ్యాక ఆయన నెమ్మదిగా వైసీపీకి దూరం అయ్యారు. ఆయన కుదిరితే టీడీపీ లేకపోతే జనసేనలో చేరాలని చూస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇంతవరకూ ఆయన గ్రీన్ సిగ్నల్ అయితే ఏ వైపు నుంచి రాలేదని అంటున్నారు. ఈ క్రమంలో భీమవరంలో పేకాట జూదం ఇష్యూ హైలెట్ కావడంతో దానిని ముందు పెట్టుకుని పవన్ ని కలిసే ప్రయత్నం చేస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. భీమవరంలో అంగబలం అర్థబలం కలిగిన నేతగా బలమైన నాయకుడిగా ఉన్న గ్రంధి శ్రీనివాస్ కి పవన్ కనుక అపాయింట్మెంట్ ఇస్తే భీమవరం రాజకీయం మొత్తంగా మారుతుంది అని అంటున్నారు. అయితే తాను ప్రస్తుతం రాజకీయాల నుంచి దూరంగా ఉన్నాను అని ఆయన చెప్పారు. తాను ఏ పార్టీలో చేరేది అన్నది ఇపుడే ఏమీ అనుకోలేదని చెప్పడం విశేషం.

# రోహిత్ శర్మ ఇంకా బరువు తగ్గుతాడు... అప్పుడు చూడండి: అభిషేక్ నాయర్

- అంతర్జాతీయ కెరీర్‌ను పొడిగించుకోవడంపై దృష్టి పెట్టిన రోహిత్ శర్మ
- 2027 వన్డే ప్రపంచకప్ ఆడటమే లక్ష్యంగా కఠిన కసరత్తులు
- ఇప్పటికే 11 కిలోల బరువు తగ్గి సరికొత్త లుక్‌లో హిట్‌మ్యాన్
- ఇష్టమైన వడాపావ్ తినడం మానేసి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వైనం
- ఇంకా బరువు తగ్గే అవకాశం ఉందని వెల్లడించిన కోచ్ అభిషేక్ నాయర్
- ఆస్ట్రేలియాతో సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపిక





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత అత్యుత్తమ వన్డే బ్యాటర్లలో ఒకడైన రోహిత్ శర్మ తన అంతర్జాతీయ కెరీర్‌ను మరింత కాలం కొనసాగించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించిన హిట్‌మ్యాన్, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీని కోసం అతడు తన జీవనశైలిలో కీలక మార్పులు చేసుకున్నాడు. ఇప్పటికే 11 కిలోల బరువు తగ్గి సరికొత్త లుక్‌లోకి మారిన రోహిత్, భవిష్యత్తులో మరింత స్లిమ్ గా, ఫిట్ గా కనిపించే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు రోహిత్ శర్మకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన భారత మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. "మూడు నెలల కఠోర శ్రమ, ఇష్టమైన ఆహారానికి దూరం, తీవ్రమైన శిక్షణ.. త్వరలో సౌతాఫ్రికాతో జరిగే సిరీస్‌లో మనం చూసేసరికి రోహిత్ మరికొన్ని కిలోలు తగ్గి కనిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని వ్యాఖ్యానించాడు. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో రోహిత్ శతకం సాధించిన సందర్భంగా అభిషేక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. గతంలో కూడా రోహిత్ ఫిట్‌నెస్‌పై మాట్లాడిన అభిషేక్ నాయర్.. తనకు అత్యంత ఇష్టమైన 'వడాపావ్' తినడం కూడా మానేసి, జిమ్‌లో ఒక బాడీబిల్డర్‌లా కసరత్తులు చేస్తున్నాడని తెలిపాడు. ఈ కఠోర శ్రమ ఫలితాలు ఆస్ట్రేలియా పర్యటనలో స్పష్టంగా కనిపించాయి. రోహిత్ తన స్లిమ్ లుక్‌తో ఎన్నో ప్రశంసలు అందుకున్నాడు. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. సిడ్నీలో జరిగిన ఆఖరి వన్డేలో విరాట్ కోహ్లీతో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అజేయంగా 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓడి సిరీస్ కోల్పోయిన శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు, ఈ విజయంతో క్లీన్‌స్వీప్ ముప్పు నుంచి తప్పించుకుంది.

# ఆసీస్ గడ్డపై కోహ్లీ రికార్డ్ బద్దలుకొట్టిన రోహిత్: తొలి విదేశీ ప్లేయర్‌గా హిట్ మ్యాన్ రేర్ ఫీట్





**హైదరాబాద్ పెన్ పవర్:** సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ సెంచరీతో చెలరేగాడు. 125 బంతుల్లో 121 పరుగులు చేసి టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ సెంచరీ ద్వారా రోహిత్ శర్మ ఓ అరుదైన ఘనత సాధించాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని వెనక్కినెట్టి ఆస్ట్రేలియాలో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన తొలి విదేశీ ఆటగాడిగా హిట్ మ్యాన్ రికార్డ్ నెలకొల్పాడు. మూడో వన్డేకు ముందు కోహ్లీ, రోహిత్ ఇద్దరూ ఆస్ట్రేలియాలో చెరో ఐదు శతకాలు బాది సంయుక్తంగా ఫస్ట్ ప్లేస్?లో ఉన్నారు. సిడ్నీ వన్డేలో సెంచరీ చేయడం ద్వారా కోహ్లీని వెనక్కి నెట్టి రోహిత్ ఈ జాబితాలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. దీంతో పాటు హిట్ మ్యాన్ మరో రికార్డ్ కూడా నెలకొల్పాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇండియా తరుపున అన్ని ఫార్మాట్లలో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు (15787 ) చేసిన తొలి బ్యాటర్?గా రికార్డ్ సృష్టించాడు. ఇప్పటి వరకు ఈ రికార్డ్ టీమిండియా డేరింగ్ అండ్ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ (15758) పేరిట ఉండేది. సిడ్నీ వన్డేలో సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మ సెహ్వాగ్ రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రోహిత్ శర్మ తర్వాతే ఉండటం గమనార్హం.

# భారత్‌తో సెమీ ఫైనల్.. ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ దూరం



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 సెమీ ఫైనల్‌లో భారత్‌కు కఠిన ప్రత్యర్థి ఎదురైంది. వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోవాలంటే ముందుగా సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించాల్సి ఉంటుంది. అక్టోబర్ 30న నవీ ముంబయిలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌కు ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ దూరమయ్యే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా హీలీ గాయపడింది. పిక్క కండరానికి గాయమవడంతో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా మ్యాచ్‌లకు దూరమైంది. అయితే, ఆ రెండు మ్యాచ్‌ల్లో అలీసా లేని లోటు కనిపించలేదు. రెండింటిలోనూ ఆస్ట్రేలియా భారీ విజయం సాధించింది. తాజాగా అలీసా గాయం గురించి ఆసీస్ హెడ్ కోచ్ షెల్లీ నిట్కే అప్‌డేట్ ఇచ్చారు. హీలీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని ఆదివారం పేర్కొన్నారు. 'అలీసా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. సెమీ ఫైనల్‌కు ఇంకా సమయం ఉంది. అప్పటికల్లా హీలీ కోలుకుని సెమీస్‌లో ఆడుతుందని ఆశిస్తున్నాం' అని ఆసీస్ హెడ్ కోచ్ తెలిపారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లే ఆడిన హీలీ 294 పరుగులు చేసింది. భారత్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో అలీసా ఆకాశమే హద్దుగా చెలరేగింది. 107 బంతుల్లోనే 21 ఫోర్లు, 3 సిక్సలతో 142 పరుగులు చేసి టీమ్ఇండియా నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. బంగ్లాదేశ్‌పై కూడా సెంచరీ (113లి) చేసింది. టీమ్ఇండియా చివరగా 2017 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరింది. అప్పుడు సెమీస్‌లో ఆస్ట్రేలియాపైనే గెలిచింది.

# 2026లో మెగాస్టార్ హ్యాట్రిక్... కాస్కోండి నా సామిరంగా..!







పదేళ్ల గ్యాప్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి రీ ఎంట్రీ ఇచ్చి గ్యాప్ లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నారు. రీ ఎంట్రీ తర్వాత ఖైదీ నెంబర్ 150 సూపర్ హిట్. ఆ తర్వాత ఆచార్య డిజాస్టర్, గాడ్ ఫాదర్ అంచనాలు అందుకోలేదు. వాల్తేరు వీరయ్య హిట్ అయితే భోళా శంకర్ బాగా నిరాశ పరిచింది.

ఈ సినిమా తర్వాత దాదాపు యేడాది పాటు చిరును వెండి తెరమీద చూడలేదు. వాస్తవానికి విశ్వంభర సినిమా ఈ యేడాదే థియేటర్లలోకి రావాల్సి ఉంది. కానీ గ్రాఫిక్స్ ఉన్న సినిమా కావడంతో పాటు కొన్ని రీ షూట్లు చేయాల్సి రావడం ఇవన్నీ కలిసి ఈ సినిమా నత్తనడకకు కారణమయ్యాయి. దీంతో విశ్వంభర 2026 సమ్మర్‌కు వెళ్లిపోయింది. చిరు కూడా ఒకానొక టైంలో విశ్వంభర విషయంలో ఏమంత ఆసక్తి చూపించలేదు. మధ్యలో అనిల్ రావిపూడి సినిమా సెట్ కావడంతో చిరు ఆసక్తి అంతా ఈ సినిమా మీదే ఉండిపోయింది. అలా మన శంకరవర ప్రసాద్ గారు వచ్చే సంక్రాంతికి శరవేగంగా ముస్తాబు అవుతోంది. ఈ క్రమంలోనే 2026లోనే చిరు మూడు సినిమాలతో హ్యాట్రిక్ కొట్టనున్నారు. ముందుగా సంక్రాంతికి మన శంకరవర ప్రసాద్ గారు వస్తుంది. సమ్మర్‌లో విశ్వంభర రిలీజ్‌కు రెడీ అవుతోంది. విశ్వంభర షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. చిన్న ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేసి సమ్మర్‌కు రిలీజ్ చేస్తున్నారు. బింబిసారతో మెప్పించిన మల్లిడి వశిష్ట్ రెడ్డి ఈ సినిమా దర్శకుడు.

ఈ రెండు సినిమాలు కాకుండా చిరు నుంచి వచ్చే యేడాదే ముచ్చటగా మూడో సినిమా కూడా వస్తోంది. చిరు – బాబి కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమాను కూడా దసరాకు రిలీజ్ అనుకుంటున్నారు. ఆల్రెడీ వాల్తేరు వీరయ్య సూపర్ హిట్ అయ్యాక.. వీరి కాంబోలో వస్తోన్న సినిమా కావడంతో మంచి అంచనాలే ఉన్నాయి. ఈ సినిమాను చకచకా పూర్తి చేసి అయితే దసరా లేకపోతే దీపావళికి రిలీజ్ చేయాలన్నది మేకర్స్ ప్లాన్. ఏదేమైనా 2025లో చిరు నుంచి ఒక్క సినిమా రాకపోయినా 2026లో మాత్రం వడ్డీతో సహా తీర్చేయబోతున్నాడు చిరు. ఇక మెగా ఫ్యాన్స్‌ను వచ్చే యేడాది ఈ వరుస పండగలతో అస్సలు ఆపలేం కదా..! మరో ఇంట్రస్టింగ్ ఏంటంటే చిరు – దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమా కూడా 2026లోనే సెట్స్ మీదకు వెళ్లనుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com